జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాపాలన

NEWS IS RIGHT

Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*

https://prajapalana.com/epaper.php


సంపుటి 16 సంచిక 141 విశాఖపట్నం సోమవారం 15 జనవరి 2024 8 పేజీలు వెల : 5.00




# నాల్గవ జాబితా..రెడీ..!

## నేడో..రేపో..ప్రకటన

- 30 స్థానాలు ప్రకటించే యోచన
- ఎంపీలు, ఎమ్మెల్యే స్థానాల్లో భారీ మార్పులు
- ఇప్పటికే మూడు జాబితాల్లో 59 సీట్లు ప్రకటన
- తాజా జాబితాలో కొత్త వారికి చోటు
- సంక్రాంతి తర్వాత జనంలోకి జగన్
- కేడర్‌తోనే నేరుగా సమావేశాలు
- మచిలీపట్నం ఎంపీ బాలశౌరి రాజీనామా
- జనసేనలో చేరుతున్నట్లు ప్రకటన
- ఏపీలో శరవేగంగా మారుతున్న రాజకీయ సమీకరణలు



విజయవాడ, ప్రజాపాలన ప్రతినిధి : అధికార వైసీపీ నాల్గవ జాబితా సిద్ధమైంది. ఆ పార్టీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆదిశగా కసరత్తు కూడా పూర్తి చేసినట్లు చెబుతున్నారు. సంక్రాంతిని పురస్కరించుకుని ఆది, సోమవారాల్లో నాల్గవ జాబితాను ప్రకటించబోతున్నట్లు చెబుతున్నారు. 30 స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించే దిశగా జాబితాలో భారీ చేర్పులు, మార్పులతో కొత్త వారికి అవకాశం కల్పిస్తూ జాబితాను రూపొందించినట్లు తెలుస్తోంది. ఇప్పటికే మూడు జాబితాల్లో 59 స్థానాల్లో మార్పులు చేస్తూ ఆ దిశగా ఇన్‌చార్జ్‌లను ప్రకటించిన అధినేత సీఎం జగన్ నాల్గవ జాబితాలో కీలకమైన స్థానాల్లో క ూడా మార్పులు చేస్తూ నిర్ణయం తీసుకున్నట్లు చెబుతున్నారు. ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు, కర్నూలు, అనంతపురం, కడప జిల్లాలతో పాటు గుంటూరు, కృష్ణా జిల్లాల్లోని పలు నియోజకవర్గాల్లో మార్పులు చేస్తూ నాల్గవ జాబితాలో ఆయా ప్రాంతాలకు చెందిన పలువురు సిట్టింగులకు స్థాన చలనం చేసినట్లు సమాచారం. గోదావరి జిల్లాల్లో క ూడా స్వల్ప మార్పులు చేపడుతున్నట్లు పార్టీ వర్గాల ద్వారా తెలుస్తోంది. ఇప్పటివరకు ప్రకటించిన మూడు జాబితాల్లో 8 లోక్‌సభ స్థానాలు 51 అసెంబ్లీ స్థానాల్లో మార్పులకు శ్రీకారం చుట్టిన సీఎం జగన్ నాల్గవ జాబితాలో 7కు పైగా లోక్ సభ స్థానాలు 23 అసెంబ్లీ స్థానాల్లో మార్పులు చేపట్టినట్లు చెబుతున్నారు. దీంతో నాల్గవ జాబితాతో కలిపితే సుమారు 90 స్థానాల్లో మార్పులు చేపట్టినట్లు అవుతోంది. మరికొన్ని స్థానాల్లో మార్పులతో 5వ జాబితాను కూడా సిద్ధం చేస్తున్నట్లు పార్టీ ముఖ్య నేతలు చెబుతున్నారు. సంక్రాంతి తర్వాత సీఎం జగన్ జనంలోకి వెళ్లాలని నిర్ణయం తీసుకున్నారు. అందుకు సంబంధించి ముహూర్తం కూడా ఖరారైంది. ఈలోపే 175 అసెంబ్లీ స్థానాలతో పాటు 25 పార్లమెంట్ స్థానాల్లో కూడా అభ్యర్థులను ప్రకటించి జిల్లాల పర్యటనలకు వెళ్లే దిశగా సీఎం జగన్ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

### 30 స్థానాలు..ప్రకటించే యోచన

త్వరలో జరగనున్న ఎన్నికల్లో 175 స్థానాల్లో గెలుపే లక్ష్యంగా పావులు కదుపుతున్న సీఎం జగన్ ప్రధాన పార్టీల కంటే ముందుగా అభ్యర్థులను ప్రకటించే దిశగా ఆయన అడుగులు వేస్తున్న విషయం తెలిసిందే. అందులో భాగంగా ఇప్పటికే మూడు జాబితాల్లో 59 స్థానాలను ప్రకటించిన వైసీపీ అధిష్టానం ఒకట్రెండు రోజుల్లో 30 స్థానాలతో నాల్గవ జాబితాను ప్రకటించబోతుంది. అందుకు సంబంధించి కసరత్తు దాదాపుగా పూర్తయినట్లు చెబుతున్నారు. కీలకమైన నాల్గవ జాబితాలో సీనియర్ నేతలు ప్రాతినిధ్యం వహిస్తున్న స్థానాల్లో కూడా ప్రకటన చేయబోతున్నారు. ముఖ్యంగా ప్రకాశం జిల్లాలో మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసులురెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న ఒంగోలు అసెంబ్లీ స్థానంతో పాటు మాగుంట శ్రీనివాసులురెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న ఒంగోలు లోక్‌సభ స్థానాన్ని కూడా ప్రకటించబోతున్నట్లు తెలుస్తోంది. అదేవిధంగా నెల్లూరు జిల్లాలోని కందుకూరుతో పాటు మరో ఒకట్రెండు స్థానాల్లో ప్రకటన చేయబోతున్నారు. అలాగే ఉమ్మడి నెల్లూరు జిల్లా పరిధిలోని గూడూరును ఇప్పటికే ప్రకటించగా వెంకటగిరి, సూళ్లూరుపేట స్థానాలను కూడా ప్రకటించే దిశగా నాల్గవ జాబితాను కసరత్తు చేశారు. అదేవిధంగా చిత్తూరు, కడప, అనంతపురం, కర్నూలు జిల్లాల్లో రెండు, మూడు స్థానాల్లో మార్పులు చేపట్టారు.

### సంక్రాంతి తర్వాత.. జనంలోకి జగన్

వరుసగా రెండవ సారి అధికారాన్ని సొంతం చేసుకోవాలని వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్న సీఎం జగన్ ఇప్పటికే సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల పేరుతో ప్రతి వారం ఏదోఒక జిల్లాలో పర్యటిస్తున్నారు. భారీ సభల్లో పాల్గొంటూ వస్తున్నారు. అయితే ఎన్నికలకు సమయం దగ్గర పడుతున్న నేపథ్యంలో ఇక పూర్తి స్థాయిలో ప్రజల్లో ఉండాలని సీఎం జగన్ నిర్ణయం తీసుకున్నారు. ఆ దిశగా సంక్రాంతి తర్వాత జనంలోనే ఉండబోతున్నారు. పార్టీ కేడర్‌తో నేరుగా సమావేశాలు నిర్వహించబోతున్నారు. ఉత్తరాంధ్ర నుంచి టూర్ ప్రారంభించేలా రూట్ మ్యాప్‌ను కూడా సిద్ధం చేశారు. ఈలోపే అభ్యర్థులను పూర్తి స్థాయిలో ప్రకటించబోతున్నారు.

తాజాగా ప్రకటించే జాబితాలో ఆ జిల్లాల్లో కూడా కీలక నేతలకు స్థానం కల్పించినట్లు చెబుతున్నారు. ఇక రాజధాని ప్రాంత జిల్లాలు గుంటూరు, కృష్ణాలో కూడా కీలకమైన స్థానాలు ప్రకటించబోతున్నట్లు తెలుస్తోంది.

### తాజా జాబితాలో..కొత్త వారికి చోటు

ఇప్పటివరకు ప్రకటించిన మూడు జాబితాల్లో కొన్ని స్థానాల్లో కొత్త వారికి అవకాశం లభించింది. అయితే నాల్గవ జాబితాలో పెద్దఎత్తున కొత్త నేతలకు కీలకమైన స్థానాలను కట్టబెట్టినట్లు తెలుస్తోంది. ప్ర జల్లో లేని శాసనసభ్యులతో పాటు పార్లమెంట్ పరిధిలో సత్తా చూపలేకపోతున్న మరి కొంతమంది సిట్టింగులను కూడా పక్కన పెడుతూ కొత్త వారికి చోటు కల్పించినట్లు సమాచారం. మొత్తం మీద నాల్గవ జాబితాలో 10 మందికి పైగా కొత్త నేతలు కీలకమైన స్థానాల్లో ఇన్‌చార్జ్‌లుగా పగ్గాలు చేపట్టబోతున్నట్లు తెలుస్తోంది.

### మచిలీపట్నం ఎంపీ.. బాలశౌరి రాజీనామా

వైసీపీ ప్రకటిస్తున్న జాబితాలపై కొన్ని జిల్లాల్లో స్థానాలు కోల్పోయిన వారిలో అసంతృప్తి వ్యక్తమవుతోంది. అటువంటి వారిని బుజ్జగించి ప్రత్యామ్నాయ అవకాశాలు కల్పిస్తామని అధిష్టానం భరోసానిస్తుంది. అయితే కొంతమంది అందుకు సానుకూలంగా స్పందిస్తున్నప్పటికీ మరి కొంత మంది మాత్రం తిరుగుబాటుకు సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో పార్టీ మారాలని కూడా మరి కొంతమంది ఇప్పటికే టీడీపీ, జనసేన నేతలతో చర్చలు జరుపుతున్నారు. అందులో భాగంగా వైసీపీకి చెందిన మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి పార్టీకి రాజీనామా చేసి జనసేన పార్టీలో చేరబోతున్నారు. ఈ మేరకు ఆయన శనివారం ట్విట్టర్ వేదికగా ప్రకటన కూడా చేశారు. అలాగే ఇప్పటికే ప్రకటించిన జాబితాల్లో కర్నూలు జిల్లాకు చెందిన మంత్రి గుమ్మనూరు జయరాంకు కర్నూలు ఎంపీ అభ్యర్థిగా పోటీ చేయాలని, ఆ దిశగా అధిష్టానం నిర్ణయం తీసుకుంది. దీంతో ఆయన గత రెండు రోజులుగా తన అనుచరులతో సమావేశమై వచ్చే ఎన్నికల్లో ఎంపీ కంటే తిరిగి తాను ప్రాతినిధ్యం వహిస్తున్న అసెంబ్లీ స్థానం నుంచే పోటీ చేయాలని నిర్ణయానికి వచ్చారు. అధిష్టానం ఆ దిశగా మార్పు చేపట్టకపోతే ఆయన కూడా ఏదోఒక నిర్ణయం తీసుకునే యోచనలో ఉన్నట్లు చెబుతున్నారు. అలాగే మరికొన్ని జిల్లాల్లో కూడా ఇదే తరహా పరిస్థితులు కనిపిస్తున్నాయి.

## ఘనంగా భోగి పండుగ



కారంపూడి... జనవరి14...ప్రజాపాలన... ప్రతినిధి :పట్టణంలోని పోలేరమ్మ గుడి వీధిలో ఉన్న ప్రజలు ఘనంగా భోగి పండుగ నిర్వహించారు ఉదయాన్నే భోగిమంటలతో ఆటలు ఆడుతూ పాటలు పాడుతూ డాన్సులు చేశారు.

## టిడిపి యువనేతను కలసిన మాజీ మున్సిపల్ చైర్మన్ యలవర్తి



గుడివాడ : టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను ఆదివారం గుడివాడ నియోజకవర్గ ఇన్‌చార్జి వెనిగండ్ల రాముతో కలసి మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు కలిశారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ గుడివాడ పట్టణానికి ఇంత అభివృద్ధి చేసిన మీలాంటి వారు రాజకీయాల్లో క్రియాశీలకంగా లేకపోవడం పార్టీకి ఇబ్బంది అవుతుందన్నారు. నేటి నుండి గుడివాడ నియోజకవర్గంలో టిడిపి గెలుపు కృషి చేయాలని యలవర్తి శ్రీనివాసరావుతో అన్నారు. ఈ యలవర్తి మాట్లాడతూ గుడివాడలో టిడిపి అభ్యర్థి గెలుపు కోసం అహర్నిశలు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కె.తులసీ పాల్గొన్నారు.

## ఏఐటియుసి నియోజవర్గ అధ్యక్షులుగా గుజర్లమూడి శేషు





గుడివాడ : కార్మికులు పక్షాన పోరాటాలు చేసి హక్కుల కోసం నిరతరం కృషి చేయాలని ఏఐటియుసి జిల్లా కన్వీనర్ టి.తాతయ్య అన్నారు. శనివారం రాత్రి స్థానిక ఎన్‌జివోహూమ్‌లో కొఠారి నరసింహారావు ప్రాంగణంలో గుడివాడ నియోజవర్గ ఏఐటియుసి 4వ మహాసభలో గుడివాడ నియోజవర్గ ఏఐటియుసి నూతన కార్యవర్గని జిల్లా కన్వీనర్ తాతయ్య సమక్షంలో ఏర్పాటు చేశారు, నియోజకవర్గ ఏఐటియుసి గౌరవ అధ్యక్షుడిగా గూడపాటి ప్రకాష్‌బాబు, అధ్యక్షుడిగా గుజ్జర్లమూడి శేషు, ప్రధాన కార్యదర్శిగా చింతలూరి సత్యనారయణ, కార్యదర్శిగా దుంపల వెంకటనరసింహరావు, కోశాధికారిగా మడుగుల రేణ్‌శివకుమార్, అఫీస్ బేరర్లుగా 5గురు సభ్యులు ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘల నాయకులు పాల్గొన్నారు.

## స్టేడియం కార్మికులకు దుస్తులు పంపిణి చేసిన ఆర్.కె

గుడివాడ : సంక్రాంతి పండుగ పురష్కరించుకుని సామాజీక వేత్త డా॥ మాచర్ల రామకృష్ణ(ఆర్.కె) ఎన్‌టిఆర్ స్టేడియంలో పనిచేసే కార్మికులకు



దుస్తులు మిఠాయిలు పంపిణి చేశారు. ఆదివారం స్థానిక ఎన్‌టిఆర్ స్టేడియంలో కార్మికులకు దుప్పట్లు, స్వీట్లు పంపిణి చేశారు. ఈ సందర్భంగా అర్‌కె మాట్లాడుతూ మన తెలుగు రాష్ట్రాల్లో అతి ముఖ్యమైన పండుగ సంక్రాంతి పండుగన్నారు. మనతోపాటు పొరుగువారు కూడా సంతోషంగా ఉండాలని ఆలోచనతో కార్మికులకు నూతన వస్త్రాలు అందజేసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగిందన్నారు ఈ కార్యక్రమంలో ఆర్‌కె వారియర్స్ షేక్ మీరాషరీఫ్, నూనే అయ్యప్ప, గంట ఆంజనేయులు, చరణ్‌తేజ్, దివిలి సురేష్, తదితరులు, పాల్గొన్నారు.

## 4వ రోజు కొనసాగుతున్న జాతీయస్థాయి ఒంగోలు జాత ఎండ్ల బండలాగుడు పోటీలు



గుడివాడ : మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని), కొడాలి చిన్నిల ఆధ్వర్యంలో స్థానిక లింగవరం రోడ్డులోని కె క్వన్షన్ ప్రాంగణంలో నిర్వహిస్తున్న ఎన్టీఆర్ టూ వైయస్సార్ జాతీయస్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బండలాగుడు ప్రదర్శన 4వ రోజుకు చేరుకున్నాయి. అదివారం సేద్య విభాగంలో జరుగుతున్న ప్రదర్శనను పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రదర్శనలో పాల్గొన్న పశు పోషకులకు అనిల్ జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ టూ వైయస్సార్ ట్రస్టు సభ్యులు వల్లురుపల్లి సుధాకర్, పాలడుగు రాంప్రసాద్, వల్లభనేని బానుప్రకాష్, వైసిపి పట్టణాధ్యక్షుడు గొర్ల శ్రీను, వైసిపి నాయకులు, పాల్గొన్నారు.

## సుజన ఫౌండేషన్ ఆధ్వర్యంలో రంగవల్లులలో సంక్రాంతి శోభ...



విస్సన్న పేట , ప్రజాపాలన ప్రతినిధి : తిరువూరు నియోజకవర్గం విస్సనపేట మండల కేంద్రం లోని సెయింట్ థెరిస్సా హై స్కూల్ నందు మాజీ రాజ్యసభ సభ్యులు సుజనా చౌదరికు చెందిన సుజనా ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో గుత్తా శివ సుబ్రమణ్యం అధ్యక్షతన సంక్రాంతి పండుగ సందర్భంగా రంగవల్లుల (ముగ్గుల) పోటీలు ఆదివారం నిర్వహించారు. ఈ పోటీల్లో మహిళలు సుమారు 100 మంది పాల్గొని రంగవల్లుల (ముగ్గులు ) అతి సుందరంగా సంక్రాంతి కళాకాంతులు తెచ్చే విధంగా గొబ్బెమ్మలతో, పూలతో, రంగవల్లులు అలంకరించి సంక్రాంతి పండుగను రంగవల్లుల రూపంలో చిత్రీకరించారు . ఈ ముగ్గుల పోటీలలో న్యాయ నిర్ణేతలుగా రంగవల్లి స్టేట్ కమిటీ మెంబెర్స్ అయిన ఎలేశ్వరపు పద్మావతి.వెన్నమనేని సాయి సుధా.వల్లురుపల్లి గిరిజా రాణి. మరియు రిటైర్డ్ గవర్నమెంట్ కళాశాల ప్రిన్సిపాల్ ముంగా జయరాజు ల ఆధ్వర్యం లో విజేతలను ఎంపిక చేశారు. ఈ ముగ్గుల పోటీలలో గెలుపొందిన వారికి సుజనా ఫౌండేషన్ కోఆర్డినేటర్ వీరమాచినేని కిరణ్, చేతుల మీదుగామొదటి బహుమతి గా రూ. 20 వెలు క్యాష్ ప్రైజ్ రెండవ బహుమతి గా రూ. 12 వేలు క్యాష్ ప్రైజ్‌మూడవ బహుమతి గా రూ. 8 వేలు క్యాష్ ప్రైజ్ మరియు పోటీలో పాల్గొన్న మహిళలకు కన్సలేషన్ బహుమతులు అందజేశారు .ఈ కార్యక్రమంలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని ,సుజనా ఫౌండేషన్ ముగ్గుల పోటీలు నిర్వహించటం అభినందనీయం అన్నారు.

జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాపాలన

NEWS IS RIGHT

Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*

https://prajapalana.com/epaper.php

సంపుటి 16 సంచిక 141 విశాఖపట్నం సోమవారం 15 జనవరి 2024 8 పేజీలు వెల : 5.00







# సంక్రాంతి సంబరాలలో జగన్

తాడేపల్లి, ప్రజాపాలన ప్రతినిధి: తాడేపల్లిలో సంక్రాంతి సంబరాలు ఘనంగా జరుగుతున్నాయి. సీఎం జగన్, సతీమణి భారతితో కలిసి వేడుకల్లో పాల్గొన్నారు. సాంప్రదాయ దుస్తుల్లో జగన్ దంపతులు భోగి మంటలు వేయడంతో పాటు పండుగ సంబురాలను మొదలు పెట్టారు. అనంతరం గంగిరెద్దులకు సారెను సమర్పించారు. గోపూజ కార్యక్రమంలో జగన్ దంపతులు పాల్గొన్నారు. వేదపండితులు సీఎం జగన్ దంపతులకు ఆశీర్వాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్



చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, సుబ్బారెడ్డి తదితరులు వేడుకల్లో పాల్గొన్నారు. ఇది


ఇలా ఉండగా, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రజలకు భోగి, సంక్రాంతి, కనుమ పండుగ శుభాకాంక్షలు తెలిపారు సీఎం జగన్ మోహన్ రెడ్డి. ఊరూ వాడా ఒక్కటై.. బంధు మిత్రులు ఏకమై.. అంబరమంత సంబరంగా జరుపుకొనే తెలుగువారి పెద్ద పండుగ సంక్రాంతి అన్నారు. భోగి మంటల సాక్షిగా చెడును దహనం చేసి.. సంతోషాల కాంతిని ఇంటి నిండా నింపుకొని.. సుఖ సంతోషాలతో.. విజయానందాలతో ప్రతి ఒక్కరూ అడుగులు ముందుకు వేయాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు వారందరికీ భోగి, సంక్రాంతి, కనుమ శుభాకాంక్షలు తెలియజేస్తున్నానని ట్వీట్ చేశారు సీఎం జగన్ మోహన్ రెడ్డి.



పాఠకులకు, ప్రకటనకర్తలకు, ఏజెంట్లకు మరియు శ్రేయోభిలాషులకు సంక్రాంతి శుభాకాంక్షలు. సంక్రాంతి సందర్భంగా నేడు ప్రజాపాలన కార్యాలయము సెలవు కావున మంగళవారం సంచిక వెలువడదు పునర్దర్శనం బుధవారం.

ఎడిటర్

## ఛత్తీస్‌గఢ్‌లో భూకంపం ..



రాయ్‌పూర్ : ఛత్తీస్‌గఢ్‌లోని బిలాస్‌పూర్ ఏరియాలో భూమి స్వల్పంగా కంపించింది. భారత కాలమానం ప్రకారం ఆదివారం మధ్యాహ్నం 2.18 గంటల సమయంలో భూమి కంపించింది. రిక్టర్‌స్కేలుపై తీవ్రత 3.1గా నమోదైందని సెంటర్ ఫర్ సిస్మాలజీ తెలిపింది. ఈ ఘటనకు సంబంధించి మరిన్ని వివరాలకు తెలియాల్సి వుందని అధికారులు తెలిపారు.

## భవిష్యత్తు మనదే : భోగి వేడుకల్లో చంద్రబాబు




అమరావతి : " భవిష్యత్తు మనదే.. అమరావతి కేంద్రంగా రాజధాని ఉంటుంది " అని టిడిపి అధినేత చంద్రబాబు అన్నారు. ఆదివారం భోగి పండుగను పురస్కరించుకొని అమరావతి రాజధాని గ్రామం మందడంలో నిర్వహించిన భోగి వేడుకల్లో జనసేన అధినేత పవన్ కల్యాణ్‌తో కలిసి చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. తెలుగుజాతి పెద్దఎత్తున నిర్వహించుకునే పండుగ సంక్రాంతి అని అన్నారు. భవిష్యత్తు మనదే.. అమరావతి కేంద్రంగా రాజధాని ఉంటుందని చెప్పారు. ఒకవైపు బాధ ఉంది.. మరోవైపు కోపం ఉందన్నారు. ఈ ప్రభుత్వ అసమర్థ, విధ్వంస విధానాలతో ప్రజలు ఇబ్బందులు పడ్డారని చెప్పారు. రాజధాని రైతులు అడుగడుగునా అవమానాలు ఎదుర్కొన్నారని అన్నారు. దేవతల రాజధానిని రాక్షసులు చెరబట్టారు అని ఎద్దేవా చేశారు. వైసిపి ప్రభుత్వానికి కౌంట్‌డౌన్ మొదలైంది అని హెచ్చరించారు.

# ఢిల్లీని కమ్మేసిన పొగమంచు

## జీరోకు పడిపోయిన విజిబిలిటీ



ఢిల్లీ :

దేశ రాజధాని ఢిల్లీ సహా ఉత్తరాదిన దట్టమైన పొగ మంచు కమ్ముకుంది. దీంతో ఢిల్లీ, చండీగఢ్ సహా ఉత్తరప్రదేశ్‌లోని తూర్పు ప్రాంతంలో విజిబిలిటీ జీరోకు పడిపోయింది. ఈ చలికాలంలో ఢిల్లీలో తొలిసారిగా జీరో విజిబిలిటీ నమోదైంది. దట్టమైన పొగమంచుతో ఢిల్లీలోని రవాణా వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడింది. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పార్కింగ్ లైట్లు, హెడ్ లైట్లు వేసి 10, 20 కి.మీ.ల వేగంతో వాహనాలు నడుపుతున్నారు. ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో అనేక విమాన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దట్టమైన పొగ మంచు కారణంగా ఢిల్లీ చేరుకోవాల్సిన పలు విమానాలను దారి మళ్లించారు. 7 విమానాలను జైపూర్‌కు, ఒక విమానాన్ని ముంబైకి మళ్లించారు. ఐజీఐ విమానాశ్రయంలో విజిబిలిటీ 350 మీటర్లుగా నమోదైందని వాతావరణ శాఖ తెలిపింది. పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్, వాయువ్య మధ్య ప్రదేశ్, చండీగఢ్ పరిసర ప్రాంతాల్లో దట్టమైన పొగమంచు ఏర్పడింది. మరోవైపు పొగమంచు కారణంగా దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి ఢిల్లీకి చేరుకోవాల్సిన 22 రైళ్లు ఆలస్యంగా ప్రారంభమయ్యాయి.

### రాహుల్ న్యాయ్ యాత్ర లేట్

దట్టమైన పొగమంచు కారణంగా రాహుల్ గాంధీ చేపట్టనున్న భారత్ జోడో యాత్ర ఆలస్యంగా ప్రారంభంకానుంది. మణిపూర్ వెళ్లాల్సిన నేతలంతా ఢిల్లీలోని ఇందిరా గాంధీ విమానాశ్రయంలోనే ఉన్నారు.



జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాపాలన

సంపాదకీయం

సోమవారం 15, జనవరి 2024

# గుడారాల్లో సంక్రాంతి

తెలుగింటి పెద్ద పండుగ సంక్రాంతి. పాఠశాలలు, కళాశాలలకు సెలవులివ్వడంతో హాస్టళ్లలో చదువుకుంటున్న పిల్లలు, దూర ప్రాంతాల్లో ఉద్యోగాలు చేసుకుంటున్నవారు కూడా ఇళ్లకు చేరుకున్నారు. ముగ్గులు, గొబ్బెమ్మలు, పిండివంటలతో సందడి సందడిగా జరుపుకునే పండుగ సంక్రాంతి ఈ దఫా వెలవెలబోతోంది. ఒకవైపు ఆకాశాన్నంటే ధరలు మరోవైపు అమలుకు నోచని కనీస వేతనాలతో శ్రమజీవులు సతమతమౌతున్నారు. అన్నీ తానై కుటుంబమంతటినీ చక్కదిద్దుకునే మహిళల్లో ఎక్కువమంది అంగన్వాడీలు పండుగపూట కూడా రోడ్డెక్కాల్సిన పరిస్థితి కల్పించింది ప్రభుత్వం. ఉదయం నుంచి రాత్రి వరకు నిరసన శిబిరాల్లోనే గడుపుతున్నారు. రకరకాల రూపాల్లో తమ నిరసన వ్యక్తం చేస్తున్నారు. 'స్త్రీని గౌరవించు దేశమే స్వర్గము/ పడతి యేడ్చు యిల్లు వల్లకాడు' అంటాడు నార్ల చిరంజీవి. పొట్ట కూటి కోసం రోజంతా కష్టపడే అంగన్వాడీ మహిళలు పండుగ పూట పిల్లలను, కుటుంబాన్ని వదిలి దీక్షా శిబిరాల్లో గడుపుతున్నారు. 'ఆడుది తిరుగబడిన తరువాత నెంత మేధావంతుడైన 'మెమె..మె' యనవలసినదే కదా' అంటారు పానుగంటి లక్ష్మీనరసింహం. రాష్ట్రంలో గ్రామాలకు గ్రామాలే వలసపోతున్నాయి. పొట్ట కూటి కోసం పట్టణాలు, నగరాల బాట పడుతున్నారు. అక్కడ కూడా పనులు దొరక్క గ్రామాలకు రివర్స్ వలసలు కూడా వున్నాయి. ముఖ్యమంత్రి మాత్రం సంక్రాంతి సంబరాలు చేసుకోవాలని భారీ ఎత్తున పత్రికా ప్రకటనలు ఇస్తున్నారు. పండుగ పూట మా కుటుంబాల్లో సంతోషం లేకుండా చేసిందీ ప్రభుత్వం. జగన్ చెప్పాడంటే చేస్తాడంతే అంటుంటే నిజమేనని సంబరపడ్డాం. మా ఆశలు అడియాసలయ్యాయి, మా నమ్మకం వమ్మయ్యింది. పిల్లలకు మేనమామనన్నాడు. అక్క చెల్లెమ్మలకు అండగా వుంటానన్నాడు. సంక్రాంతి కానుకగా ఎస్మా, షోకాజ్ నోటీసులు అందించారు అని అంగన్వాడీలు వాపోతున్నారు. సమ్మె శిబిరాల్లోనే ముగ్గులు వేస్తున్నారు. గొబ్బెమ్మలు పెడుతున్నారు. పిండివంటలు వండి నిరసన తెలుపుతున్నారు. ఇప్పటికే క్రిస్మస్, నూతన సంవత్సరం వేడుకలు కూడా రోడ్లపైన, శిబిరాల వద్దే జరుపుకున్నారు. ఇప్పుడు సంక్రాంతి కూడా గుడారాల్లోనే జరుపుకుంటాంఅంతేగాని మా సమస్యలు పరిష్కారమయ్యే వరకూ తగ్గేదే లేదంటున్నారు. 'స్త్రీ అనే అక్షరంలో విశ్వశక్తి సౌందర్యం, కవిత్వం, మాతత్వం, మమకారం, వీరత్వం, వాత్సల్యం, సంగీతం- వంటి విభిన్న భావానుభూతులు అనేకం వున్నాయ'ని అంటారు శిలాలోలిత. మహిళలు ఎంత సుకుమారంగా వుంటారోఅంత ధీరత్వాన్నీ ప్రదర్శిస్తారు. దానికి నిదర్శనమే గత నెల రోజులుగా మొక్కవోని దీక్షతో అంగన్వాడీలు సాగిస్తున్న పోరాటం. వీరు ఎముకలు కొరికే చలిని కూడా లెక్క చేయకుండా నిరసన గళం విప్పారు. 'ఓ దేశ మహిళ స్థితిగతుల్ని చూసి ఆ దేశ పరిస్థితిని ఇట్టే చెప్పేయవచ్చు'నని జవహర్‌లాల్ నెహ్రూ చెబుతారు. సమాజం ఎంత నాగరికమైనది, మానవీయమైనది అన్నది తెలుసుకోవాలంటే మహిళల జీవితమే ప్రమాణం-అని సామాజిక శాస్త్రవేత్తలు చెబుతున్న మాట. రాష్ట్రంలోని వనరులను అదానీలు, అంబానీలకు ఉచితంగా కట్టబెడుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలుప్రజల కనీస అవసరాలను తీర్చడానికి మాత్రం మీనమేషాలు లెక్కిస్తున్నాయి. అధికార బలంతో ప్రజల హక్కులను, కోర్కెలను నిరంకుశంగా అణచివేస్తున్నాయి. ఏ వ్యక్తికైనా నమ్మకం చాలా అవసరం. నమ్మకం లేని వ్యక్తులు చెప్పే మాటలు నీటి మీద రాతలాంటివే. మనిషి జీవితం నమ్మకంతోనే ముడిపడి ఉంటుంది. నమ్మకం వుంటే ప్రపంచంలో ఏదైనా సాధించవచ్చు. కాబట్టే నెపోలియన్ అసాధ్యం అనే పదాన్ని డిక్షనరీలోంచి తీసివేయాలన్నాడు. మనం చేసే పనిపై నమ్మకం వుంటే అసాధ్యం అనేది ప్రపంచంలోనే లేదు. ఆ నమ్మకమే 33 రోజులుగా నిరంతరాయంగా సమ్మె కొనసాగించడానికి కారణమైంది. అదే నమ్మకం సమ్మెను మరింత ముందుకు తీసుకెళ్లడానికి, కనీస వేతనాలు సాధించుకోడానికి ఊతమిస్తుంది. 'నువ్వు అందరినీ కొంత కాలం, కొంతమందిని ఎల్లకాలం మోసం చేయవచ్చు. కాని అందరినీ ఎల్లకాలం మోసం చేయజాలవు' అంటాడు అబ్రహం లింకన్. ఏ నాయకుడైనా నమ్మికతో ప్రజల మనసులను గెలుచుకోవాలే తప్ప కుయుక్తులతో ఓట్ల రాజకీయానికే పరిమితం కారాదు. నమ్మకాన్ని కోల్పోయిన వారికి బుద్ధి చెప్పడానికి రేపనేది వుంటుందని మర్చిపోకూడదు. 'ఆడువారి అడుగుల రాపిళ్లలో/ పుడుతుంది ఆరని చైతన్యం' అంటారు కవయిత్రి వాకా ప్రభావతి. ఆ చైతన్యం నిరసన గళమెత్తితే నిలువరించడం అసాధ్యం. సమస్య పరిష్కారమే ఏకైక మార్గం.

సామాజిక దృక్పథంతో మీరు రాసే రచనలు
editor. prajapalana@gmail.com
మెయిల్ కు పంపించినచో ప్రజా పాలన
దినపత్రికలో ప్రచురించబడును

# రామా కనవేమిరా? రాజకీయాలు.. కుటిల కోణాలు!




జనవరి 22వ తేదీ దగ్గర పడుతున్న కొద్దీ అయోధ్య రామ మందిర ప్రాణ ప్రతిష్ఠ హడావుడి తారాస్థాయికి చేరుతున్నది. రాజకీయ ప్రచారాలు, వివాదాలూ రామభక్తిని మించి పొంగి పొర్లుతున్నాయి. మొక్కుబడి కోసం పిలుపులు అందించి 'వారు రావడం లేదు చూశారా!' అంటూ దాడులు పెరుగుతున్నాయి. సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరితో వారు మొదలుపెట్టిన ఈ ప్రహసనం ఇప్పుడు కాంగ్రెస్ నేతలు సోనియా, రాహుల్ గాంధీలపై దాడితో మరింత తీవ్ర స్థాయికి చేరింది. రాము అనిపించుకోవడానికే పిలిచి రామ వ్యతిరేకతతో రాలేదనే రాజకీయ దుష్ప్రచారం ఎత్తుకోవడంలో ఎత్తుగడ ఎవరికీ తెలియంది కాదు. అయోధ్య సమస్యపై సుప్రీంకోర్టు తీర్పు వచ్చిన నాటి నుంచి ఇప్పుడు ప్రాణ ప్రతిష్ఠ వరకూ మోడీ సర్కారు కనుసన్నల్లో అధికార కార్యక్రమంగానే అంతా జరుగుతోంది. ఇప్పుడు ఇతరులను భాగస్వాములు కాలేదని నిందించడమూ వ్యూహాత్మకంగానే జరుగుతోంది. మత విశ్వాసాలు ప్రభుత్వ ఆధ్వర్యంలో జరగడం లౌకిక రాజ్యాంగ విరుద్ధమనేది ప్రాథమిక సూత్రం. దాన్ని తోసిపుచ్చి మొత్తం మోడీ భజనగా మార్చడం రెండు మాసాల్లో వచ్చే ఎన్నికల్లో రాజకీయ ప్రయోజనాల కోసమే. దేవుడి పెళ్లికి అందరూ పెద్దలే అంటారు. ఇక్కడ మాత్రం బిజెపి, సంఘ పరివార్‌లు దీనికి కర్త, కర్మ, క్రియ ప్రధాని మోడీ మాత్రమే అన్నట్టు నడిపిస్తున్నాయి. ఇది ఎంతవరకూ పోయిందంటే 1990లలో రథయాత్రతో అయోధ్యను దేశ రాజకీయాలలో కేంద్ర స్థానానికి తెచ్చిపెట్టిన అప్పటి బిజెపి అధినేత లాల్‌కృష్ణ అద్వానీని కూడా దూరం పెట్టేంత వరకూ. లోకోపవాదానికి వెరచి చివరకు రప్పిస్తున్నా రాముడే మోడీని ఎన్నుకున్నాడని ఆయనతో చెప్పిస్తున్నారు. వచ్చే వారం రోజుల్లోనూ ఈ వ్యూహాలు మరెన్ని వింతలకు దారితీస్తాయో చూడవలసిందే. పురాణాల్లో కృష్ణలీలలుంటాయి గాని రామలీలలుండవు. రామలీలా మైదాన్‌లు కూడా తర్వాత వచ్చినవే. రాముడి పేరిట ఆర్ఎస్ఎస్, బిజెపి లీలలే ఇవన్నీ.

**పాలక పార్టీల భిన్న వైఖరులు**

వాస్తవానికి అయోధ్య రామమందిరం పేరిట సంఘ పరివార్ శాఖలు, అనుబంధ సంస్థలు దేశమంతటా అక్షింతలు పంచిపెడుతున్నారు. బిజెపి ఎం.పి జివిఎల్ నరసింహారావు విశాఖలో స్వయంగానే ఈ కార్యక్రమం నిర్వహించారు. అన్ని పార్టీల అధ్యక్షులను, కార్యదర్శులను లాంఛనంగా పిలిచినట్టు చేస్తున్నారు. వాటి వాటి కోణాలలో అవి స్పందిస్తున్నాయి. మతం, రాజకీయం కలగాపులగం చేయకూడదనే రాజ్యాంగ సూత్రాలను కమ్యూనిస్టులు ఎప్పుడూ పాటిస్తారు. ఇప్పుడూ అదే చేస్తున్నారు. కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, శివసేన, బిఆర్ఎస్, సమాజ్‌వాది పార్టీ, వైసిపి, ఆప్ వంటి వివిధ పాలక పార్టీల విషయం చూస్తే అనేక కోణాలు కనిపిస్తున్నాయి. మీడియాలోనూ విభిన్న వ్యాఖ్యానాలు కనిపిస్తున్నాయి. ఆ యా పార్టీలపై, వ్యక్తులపై సంఘ పరివార్ ప్రతిస్పందనలోనూ తేడాలున్నాయి. ప్రధాన రాజకీయ ప్రత్యర్థిగా కాంగ్రెస్ పైన, సైద్ధాంతిక ప్రత్యర్థులైన కమ్యూనిస్టుల పైన తీవ్రంగా దాడి జరుగుతున్నది. ఇన్ని దశాబ్దాలలో లౌకిక సూత్రాల విషయంలో ఊగిసలాటలకు గురై బిజెపి పెరుగుదలకు బాట వేసిన కాంగ్రెస్ నేతలు ఈ దశలోనూ వివిధ స్థాయిల్లో రకరకాలుగా స్పందిస్తూ కొంత గందరగోళం ప్రదర్శిస్తున్నారు. ఇది ఫక్తు బిజెపి కార్యక్రమంలా జరుగుతున్నందునే వెళ్లడం లేదని కాంగ్రెస్ ప్రకటించింది. వారు అధికారంలో వున్న కర్ణాటకలోగాని, బిజెపికి కీలకమైన యు.పి, గుజరాత్‌లలో గానీ కాంగ్రెస్ వేర్వేరు రూపాలలో వ్యవహరిస్తున్నది. అసలు అయోధ్య స్థలం తాళాలు తీసిందే తాము గనక ఈ ఘనత తమదేనన్న ప్రచారం వాటిలో ఒకటి. మేమంతా హిందువులమే మీ అనుమతి ఏమిటన్న ప్రశ్న మరొకటి. మమతా బెనర్జీ కూడా ఇదే విధమైన వ్యాఖ్యలు చేశారు. అసలు అయోధ్యకు వెళ్లకపోవడం ద్వారా కాంగ్రెస్ పెద్ద తప్పు చేసిందని కొందరి మాట. ఇప్పటికైనా ఈ నిర్ణయం తీసుకుని కొంత వాస్తవికత చూపిందని రాజ్‌దీప్ సర్దేశాయి వంటి వారి వ్యాఖ్యానం. నెహ్రూ మత విషయాల్లో రాజ్యాంగ బద్ధమైన దూరం పాటించినా 1980 తర్వాత ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీలు ఆ మార్గం నుంచి వైదొలగడం వల్లనే బిజెపి రాజకీయ శక్తిగా ఎదగడం సాధ్యమైందనేది ఆయన విశ్లేషణ. వైసిపి వంటి పార్టీలు రాజకీయంగా ఏం మాట్లాడలేదు గాని టిటిడి సంస్థ ద్వారా లడ్డూలు, ప్రసాదాలు పెద్ద ఎత్తున పంపించి ప్రచారం చేసుకుంటున్నాయి. పాలక పార్టీల నేతలు చాలామంది వ్యక్తిగత స్థాయిలోనూ, స్థానికంగానూ తాము ఇందులో పాలు పంచుకుంటున్న భావం కలిగించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇక బిఆర్ఎస్ పార్టీ అయితే వారి పత్రికలో అయోధ్యలో కలలు నెరవేరుతున్నట్టుగా సంపాదక వ్యాసం ఇచ్చింది. కాంగ్రెస్ డిఎన్ఎ హిందూ వ్యతిరేకమని, ఆ పార్టీ ఎమ్మెల్సీ కవిత ట్వీట్ చేశారు. ఇప్పుడు దేశవ్యాపితంగా పరివార్ పాడుతున్న పాట ఇదే. తాము తప్ప అందరూ హిందూ వ్యతిరేకులేనన్నట్టు చిత్రించడం ఇక్కడ ఉద్దేశం. మల్లికార్జున ఖర్గే దీనికి సమాధానమిస్తూ భక్తి గల వారంతా రామమందిర సందర్శనకు ఎప్పుడైనా వెళ్లవచ్చుననీ దీనికి బిజెపి అనుమతి అనవసరమనీ విమర్శించారు. మరో వంక సంఘ పరివార్ ప్రతినిధులు. మదర్ థెరిసా సాధుకరణ సందర్భంలో సోనియా గాంధీ పోప్‌కు రాసిన లేఖనూ, రాహుల్ గాంధీ బాబరు సమాధి సందర్శననూ ఈ సమయంలో పోటీ పెట్టి మాట్లాడుతున్నారు. అయితే నెహ్రూ గతంలో సోమనాథ్ ఆలయ పునర్నిర్మాణాన్ని వ్యతిరేకించారనీ, హోంమంత్రి సర్దార్ పటేల్‌ను అక్కడకు వెళ్లవద్దని సలహా ఇచ్చారని బిజెపి సిద్ధాంతకర్తలు చరిత్ర తవ్వితీస్తున్నారు. అధికార హోదాలో నాటి రాష్ట్రపతి రాజేంద్రప్రసాద్ ఆ ఆలయం ప్రారంభించడం లౌకిక సూత్రాలతో సరిపడదని నెహ్రూ చెప్పిన మాట సరైందే. అయితే స్వతహాగా మితవాదులైన పటేల్, ప్రసాద్ ఆయన మాటలు ఆలకించలేదు. ఇక్కడ రాజ్యాంగ స్ఫూర్తి ఏదన్న సంగతి వదలిపెట్టి నెహ్రూ పొరబాటు చేసినట్టు చెప్పడం గడుసుతనం మాత్రమే.

**శంకర పీఠాధిపతులు దూరం!**

ఇప్పటి వరకూ మనం రాజకీయ పార్టీల గురించి మాట్లాడాం. కానీ మరోవైపున సనాతన హిందూ శిబిరంలో వారూ మోడీ హడావుడిని ఆక్షేపిస్తున్నారు. ఆ ధర్మానికి ప్రతీకలుగా పరిగణించబడే నాలుగు శంకర పీఠాల మహాచార్యులు బహిష్కరిస్తున్నారు. వారి కారణాలు సంప్రదాయపరమైనవి. ఆలయ నిర్మాణం పూర్తి కాలేదనీ, అసలు మసీదు శిథిలాల మీద ఆలయ నిర్మాణం శాస్త్ర విరుద్ధమనీ, పూజాదికాలు మోడీయే నిర్వహించడానికి వీలు లేదనీ తమ తమ కోణాల్లో అభ్యంతరాలు ప్రకటించారు. తమాషా ఏమంటే ప్రతిపక్షాలపై ఇంతగా విరుచుకుపడిన బిజెపి, సంఘ పరివార్ వారి ఊసే ఎత్తడం లేదు. వారి అభ్యంతరాలు విననట్టే నటిస్తున్నది. బిజెపి ఎంపీగా పని చేసిన సుబ్రహ్మణ్య స్వామి మరో విధమైన అభ్యంతరం లేవనెత్తారు. హిందూ సంప్రదాయంలో ఏదైనా భార్యా సమేతంగా చేయాలనీ, రాముడు అశ్వమేధ యాగం స్వర్ణ సీతతో చేసిన గాథలు గుర్తు చేశారు. ఆమెను రావణుడు అపహరిస్తే రాముడు అన్వేషిస్తూ వెళ్లాడనీ కానీ మోడీ వ్యవహారం అందుకు పూర్తి భిన్నంగా వుందని అపహాస్యం చేశారు. ఇవన్నీ ఆమోదించాలని కాదు గానీ, సంప్రదాయం, సనాతనం అనేవారు ఆ వర్గాల మాటలనూ బేఖాతరు చేయడం గమనించదగింది. మోడీ బృందానికీ సంఘ పరివార్‌కు 2024 ఎన్నికల్లో రాజకీయ ప్రయోజనాలు తప్ప మరేమీ కనిపించవు. నిజానికి అవి వారికి ముఖ్యం కాదు కూడా! కనుక ఇక్కడ సమస్య రాజకీయమైంది తప్ప రాముడికీ ఆయన భక్తులకూ సంబంధించింది కానే కాదు. ఇప్పుడు పరిష్కారం కూడా బిజెపి రాజకీయ ఉద్యమాలు, సుప్రీం కోర్టు తీర్పు ద్వారా సాధ్యం చేయబడింది. బాబ్రీ మసీదు డిసెంబర్ 6న కూల్చబడింది గనకే అక్కడ అవకాశమేర్పడింది. ఆ కూల్చివేత ఏ విధంగానూ సరైంది కాదనీ నేరపూరిత చర్య అనీ కోర్టు అభిశంసించింది. మసీదుకు మరో చోట స్థలం ఇవ్వాలనీ నిర్దేశించింది. అయితే అంతిమంగా తీర్పు మాత్రం ఏకపక్షంగా వుందనే విమర్శలు పున:సమీక్షించాలన్న అభ్యర్థనలూ చాలా వున్నాయి. అసలు అయోధ్య వివాదం రాజేసిందే బ్రిటిష్ అధికారులు అన్న వాస్తవాలు చాలాసార్లు చెప్పుకున్నవే. అయోధ్య మందిరానికి మరో కోణం కూడా వుందని మాత్రం గుర్తుంచుకోవాలి. మూడు పదుల ముప్పేట దాడి 1992లో బాబ్రీ మసీదు విధ్వంసం జరిగింది. 2002లో గుజరాత్ మారణకాండ సాగింది. 2012-13లో మోడీ ప్రధాని అభ్యర్థిగా ముందుకొచ్చారు. 2020 ఆగష్టు 5న మోడీయే భూమి పూజ చేశారు. ఈ జనవరి 24న ప్రాణ ప్రతిష్ఠ జరుగుతుందని ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ గత సెప్టెంబరులోనే ప్రకటించారు. ప్రధాని కార్యాలయంలో కీలక అధికారిగా పని చేసిన నృపేంద్ర మిశ్రా అయోధ్య ఆలయం కోసం ఏర్పాటు చేసిన శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్టు చైర్మన్‌గా వున్నారు. దాదాపు రూ.18 వేల కోట్ల బడ్జెట్‌తో ఈ నిర్మాణం సాగుతున్నది. యు.పి ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ కూడా మధ్య మధ్య కొన్ని క్రతువులు నిర్వహించారు. ఈ క్రమంలో అయోధ్యలో రియల్ మాఫియాలు, టూరిస్టు కేంద్రాలు విపరీతంగా పుట్టుకొచ్చాయి. ఈ ప్రారంభోత్సవ సమయంలోనైతే హోటల్ గది లక్ష రూపాయలు కూడా వున్నట్టు కథలు వస్తున్నాయి. మితవాద, మతవాద రాజకీయాలు ఉధృతమైన ఈ కాలానికి హిందూత్వ రాజధానిగా అయోధ్య వెలుగొందుతుందని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. 'బుల్డోజర్ రాజ్' నడిపిస్తున్న యోగి యు.పి ని పాలిస్తుండడం దీనికి అదనపు అంశంగా వుంది. గాంధీని హతమార్చి గాడ్సేను ఆరాధ్యుడుగా చూపే సంఘ పరివార్ చరిత్ర కొత్త కాదు. ఆయన జీవితమంతా 'రఘుపతి రాఘవ రాజారాం' అని పాడేవారని బిజెపి అధికార ప్రతినిధి సుధాంశుత్రివేది ఉవాచ. గాంధీజీ 'ఈశ్వర్ అల్లా తేరే నామ్' అని కూడా పాడిన గాంధీ తర్వాతి వాక్యాలను ఆయన కావాలనే వదిలేశారు. కానీ భిన్న మతాలు, సంప్రదాయాలను అనుసరించే వారందరూ భారతీయులేనన్న కనీస అవగాహన గలవారెవరైనా జాతిపిత జాడలనే అనుసరిస్తారు. రామ రథయాత్ర కాలంలో తన సహాయకుడుగా వుండిన మోడీ అంత ప్రసిద్ధుడు కాకున్నా రాముడు ఆయననే తన ఆలయ నిర్మాణానికి ఎన్నుకున్నాడని అద్వానీ వ్యాసం రాస్తున్నారు. వాస్తవానికి అద్వానీని, మోడీని, రాముణ్ని కూడా ఎన్నుకున్నది సంఘ పరివార్ మాత్రమే. అందుకే రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్య భారత పరిణామ క్రమంలో అయోధ్య రామమందిర ఘట్టాన్ని చాలా నిశితంగా విమర్శనాత్మకంగా పరిశీలించవలసి వుంటుంది. లౌకిక భావాలు గల వారెవరైనా దీన్ని యథాలాపంగా భావిస్తే పొరబాటవుతుంది. హిందూ మతం వేరు, హిందూత్వ రాజకీయం వేరు. ఆ రాజకీయం రాజ్యం చేయడం వేరనే స్పష్టత కోల్పోకూడదు. నడుస్తున్నది మోడీ రాజ్యమే గానీ రామ రాజ్యం కాదని తెలియజెప్పక తప్పదు.

# రైతు రుణమాఫీకి తెలంగాణ ఫార్మర్స్ కార్పొరేషన్

## ఈ నెలాఖరులోనే ఏర్పాటు?

- రూ.32 వేల కోట్లు నిధుల సమీకరణకు కసరత్తు
- కేంద్ర ప్రభుత్వరంగ సంస్థల ద్వారా రుణం
- అంతా ఓకే అయితే ఒకే విడతలో మాఫీ
- లేదంటే రెండు విడతలుగా చేసేలా ప్రణాళిక
- 30.50 లక్షల మంది రైతులు అర్హులు అంచనా
- కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసిన ఆర్థికశాఖ
- 20న మంత్రివర్గ సమావేశంలో తుది నిర్ణయం?



హైదరాబాద్, ప్రజాపాలన ప్రతినిధి: తెలంగాణలో తమ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత గరిష్టంగా వంద రోజుల్లోగా రైతుల రుణాలన్నీ (రూ.2లక్షల వరకు) మాఫీ చేస్తామని చెప్పిన కాంగ్రెస్.. ఆ దిశగా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకుంది. అయితే అధికారంలోకి రావటంతో ఇచ్చిన హామీలను అమలు చేసే విషయంపై దృష్టి పెట్టిన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఖాళీగా మారిన ఖజానాపై ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించారు. ఎన్ని కష్టనష్టాలు ఎదురైనా.. ప్రజలకిచ్చిన మాట నిలబెట్టుకునేందుకు, ఆరు గ్యారెంటీలను ఖచ్చితంగా అమలు చేసి ప్రభుత్వ ప్రతిష్టను చాటి చెప్పేందుకు తగ్గేదేలేదన్న సంకేతాలతో ముందుకు సాగుతున్నారు. ఈ క్రమంలో అత్యంత ప్రాధాన్యత గల అంశం రైతు రుణమాఫీపై మహా ప్రణాళికను సిద్ధం చేసుకున్నారు. ఇందుకు అవసరమయ్యే నిధులు భారీ పద్దుతో కూడుకున్నది కావడంతో ఆర్థికవేత్తల సూచన మేరకు 'తెలంగాణ ఫార్మర్స్ కార్పొరేషన్'ను నెలకొల్పాలని నిర్ణయించారు. గత ప్రభుత్వంలో ఉన్న రైతు సమన్వయ సమితి కార్పొరేషన్‌ను రద్దుచేసి ఆ స్థానంలో కొత్త కార్పొరేషన్‌ను ఆవిష్కరించనున్నారు. అయితే ఈ రెండు కార్పొరేషన్ల విధానాలు, లక్ష్యాలకు భారీ తేడా ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఈ నెల 20న జరగనున్న రాష్ట్ర మంత్రిమండలి సమావేశంలో ఈ అంశంపై చర్చించి నెలాఖరు నాటికి కార్పొరేషన్ కార్యరూపంలోకి వచ్చేలా ప్లాన్ చేసుకున్నారు.

కార్పొరేషన్ ఏర్పాటైన వెంటనే రైతు రుణమాఫీ కార్యాచరణ ప్రణాళిక అమలు చేయనున్నారు. అందుకోసం ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వరంగ సంస్థల ద్వారా భారీ రుణం పొందే ప్రయత్నం చేస్తోంది. రాష్ట్ర వ్యవసాయ సహకార శాఖ, రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమితి (ఎస్ఎల్‌బీసీ) నుంచి అందిన నివేదికల ఆధారంగా నిధుల అవసరం సరాసరిగా రూ.32 వేల కోట్లుగా ఆర్థిక శాఖ అంచనా వేసింది. ప్రాథమికంగా జిల్లాల నుంచి అందిన సమాచారం మేరకు 30.50 లక్షల మంది రైతులను అర్హులుగా గుర్తించారు. వాళ్ళందరికీ ఒకటి లేదా రెండు విడతల్లో రుణమాఫీ చేసి మాట నిలబెట్టుకునేందుకు కసరత్తు వేగంగా జరుగుతోంది. కేంద్ర ప్రభుత్వరంగ సంస్థల ద్వారా ప్రతిపాదించిన మేరకు పూర్తి రుణం వస్తే.. ఏకకాలంలో రుణమాఫీ చేయాలని, లేదంటే రెండు విడతలుగా మాఫీకి ప్రణాళిక సిద్ధం చేయాలని ఇప్పటికే పలు సమీక్షల సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి ఆర్థిక శాఖ అధికారులను ఆదేశించారు. ఆర్థికశాఖ అధికారుల నుంచి విశ్వసనీయంగా అందిన సమాచారం మేరకు తొలివిడతగా రూ.20 వేల కోట్లు, మలివిడతగా రూ.12 వేల కోట్లు రుణంగా పొందేందుకు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఒకేసారి రూ.32 వేల కోట్ల రుణం మంజూరయ్యే అవకాశాలు చాలా తక్కువగా ఉన్నట్లు చెబుతున్నారు. కార్పొరేషన్ ఏర్పాటయ్యాక అన్ని బ్యాంకుల రుణాలను ప్రభుత్వ రుణంగా అడాప్ట్ చేసుకోనున్నారు. ఆ మొత్తాన్ని ఆయా బ్యాంకుల్లో ప్రభుత్వ రుణంగా రీషెడ్యూల్ చేసి కార్పొరేషన్ ద్వారా నెలనెలా వాయిదాల చెల్లింపులు చేయనున్నారు. త్వరలోనే ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటుపై ప్రకటన వెలువడే అవకాశం ఉంది. ఈ కార్పొరేషన్‌కు రిజిస్ట్రేషన్లు, స్టాంపులు, వాణిజ్య పన్నులతో పాటు ఇతర శాఖల ద్వారా వచ్చే ఆదాయంలో కొంత భాగాన్ని మళ్లించాలని చూస్తోంది. ఫలితంగా ప్రతి నెలా ఈఎంఐ పద్ధతిలో బ్యాంకులకు డబ్బులను చెల్లించవచ్చని ప్రభుత్వం లెక్కలు వేస్తోంది.

### బ్యాంకులకు ఐదేళ్లు ఈఎంఐ ప్లాన్

గరిష్టంగా ఐదేళ్ళ వాయిదా ప్రణాళికతో ప్రభుత్వం రుణమాఫీ కోసం తీసుకుంటున్న కొత్త రుణంపై ఆర్థిక సంస్థలకు సర్కారు బాండ్ల గ్యారెంటీ ఇవ్వనున్నారు. ప్రస్తుతం రాష్ట్రం రూ.6 లక్షల కోట్ల అప్పుల్లో ఉంది. ఇలాంటి పరిస్థితిలో రుణమాఫీ, అదీ ఏకకాలంలో చేయడం కత్తిమీద సామే. కానీ, కాంగ్రెస్ సర్కార్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ కావడంతో దానిని నెరవేర్చాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో నిధుల సమీకరణ కష్టతరంగా మారింది. ఈ పరిస్థితిలో రేవంత్ సర్కార్ పంట రుణమాఫీకి కొత్త ఆలోచనను తెరపైకి తెచ్చింది. ఏకకాలంలో పంట రుణాలు మాఫీ చేసి.. ఆ మొత్తాన్ని వాయిదా పద్ధతిలో బ్యాంకులకు చెల్లించాలని భావిస్తోంది. ఈమేరకు ప్రణాళిక రూపొందిస్తోంది. ఈ విషయమై ఇప్పటికే బ్యాంకర్లతో చర్చలు కూడా జరిపింది.

### కాంగ్రెస్ ట్విట్టర్‌లో స్పష్టత

ఇక ఇదే రుణమాఫీకి సంబంధించి తెలంగాణ కాంగ్రెస్ ట్విట్టర్ ఖాతాలో ఓ పోస్ట్ కూడా పెట్టి పరోక్షంగా స్పష్టతనిచ్చింది. కోట్ల రైతురుణాలను ప్రభుత్వం మాఫీ చేయబోతుందని, ఇందుకోసం ప్రత్యేకంగా కార్పొరేషన్ కూడా ఏర్పాటు కాబోతుంది తెలిపింది.

### రుణమాఫీకి కటాఫ్ తేదీ ఏదీ?

ఇక రైతు రుణమాఫీ విషయంలో కటాఫ్ తేదీ అనేది చాలా ముఖ్యం. అయితే ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం, ఏ తేదీని కటాఫ్‌గా నిర్ణయిస్తుందనేది ఈ నెల 20న జరిగే మంత్రి మండలిలో తేలనుంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటికి ఉన్న రుణాలను మాఫీ చేస్తుందా...? లేక ఇంకా వేరే ఏదైనా తేదీని ప్రమాణికంగా తీసుకుంటుందా అనే అంశంపై స్పష్టత రావాల్సి ఉంది.

## నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో జాతీయ యువజన వారోత్సవాలు



ప్రజా పాలన ప్రతినిధి కడప జిల్లా కడప: కడప నగరంలోని నాగరాజ పేట నందు శ్రీ వెంకట సాయి కోచింగ్ టర్నింగ్ పాయింట్ సంస్థలో జాతీయ యువజన వారోత్సవాల శుభ సందర్భంగా నిఖిల్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ కడప వారి ఆధ్వర్యంలో గ్రూప్ 2 పరీక్షలకు పోటీ పడుతున్న విద్యార్థిని విద్యార్థులకు స్వామి వివేకానంద యొక్క జీవిత చరిత్ర,సూక్తులు(1). రోజుకు ఒక్కసారైనా మీతో మీరు మాట్లాడుకోండి.(2) మీకు సహాయం చేస్తున్న వారిని మరవకండి. (3) ఎవరి కోసమో, దేనికోసమో ఎదురు చూడకండి. (4) ఒక ఆలోచనను స్వీకరించండి.



(5). చావు బ్రతుకులు ఎక్కడో లేవు, ధైర్యంతోనే బ్రతుకు ఉంది, భయం లోనే చావు ఉంది.

(6) అపారమైన విశ్వాసం,అనంతమైన శక్తి.. ఇవే విజయ సాధనకు మూల సాధనాలు.

పై విధంగా డాక్టర్ జాలా ప్రభాకర్ ప్రముఖ న్యాయవాది కడప, విద్యార్థి విద్యార్థులను ప్రేరేపిస్తూ, యువశక్తిని పెంపొందిస్తూ, నవీన యువత సమ సమాజానికి, నవ సమాజానికి యువతే పునాదులై ప్రపంచాన్ని నడిపించాలని యువతకు ప్రముఖ న్యాయవాది డాక్టర్ జాల ప్రభాకర్ పిలుపునిచ్చాడు. ఈ కార్యక్రమములో వెంకట్ రెడ్డి, భాష, సిబ్బంది, మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొని పోటీ పరీక్షలో పాల్గొని నెగ్గిన వారికి బహుమతులు అందజేయడం జరిగినది.

## ఎస్సీ ఎస్టీ కేసు పై చీరాల డిఎస్పి విచారణ

### మేదరమెట్ల ఎస్సై పైలి లిఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేయాలని నీలం డిమాండ్



అద్దంకి ప్రజాపాలన ప్రతినిధి : దళిత యువకుడు కాకుమాని రవి పై బియ్యం స్మగ్లర్లు దాడి చేసిన ఘటనపై ఎస్సీ ఎస్టీ కేసులో చీరాల డిఎస్పి ప్రసాదరావు విచారణ జరిపారు. ఈనెల 6 తేదీన నాగులప్పలపాడు మండలం తక్కెళ్ళపాడు గ్రామానికి చెందిన రేషన్ బియ్యాన్ని స్మగ్లింగ్ చేస్తున్న లారీని ఆపిన ఘటనలో దళిత యువకులపై మిల్లు హనుమంతరావు మరి కొంతమంది దాడి చేశారు. కాకుమాను రవి ఫోన్ పగలగొట్టి రాళ్లతో అతనిపై దాడి చేశారు. నిందితుడు ఎన్నికపాడు హనుమంతరావు అలియాస్ మిల్లు హనుమంతరావు పమిడిపాడు గ్రామానికి చెందినవారు. బాధితుడు కాకుమాను రవి ఒంగోలు రిమ్స్ హాస్పటల్లో చేరి చికిత్స పొందుతూ అవుట్ పోస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటన 8/24 ఎస్సీ ఎస్టీ కేసుగా మేదరమెట్ల పోలీస్ స్టేషన్లో నమోదైనది. ఈ కేసు ఫిర్యాదు విషయంలోనే మేదరమెట్ల ఎస్సై నాగ శివారెడ్డి ఫిర్యాదుదారుడైన కాకుమాను రవిని బెదిరిస్తూ అగ్రకుల రేషన్ బియ్యం స్మగ్లింగ్ కొమ్ము కాస్తూ కాకుమాని రవి పై రవి సీటు ఓపెన్ చేస్తానని బెదిరించడం జరిగినది. అలాగే మాల మాదిగలు అంటూ అవమానించడం జరిగినది. మరలా ఈ వ్యాఖ్యలు చేసిన మేదరమెట్ల ఎస్సై నాగ శివారెడ్డి పై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేయాలని సస్పెండ్ చేయాలని దళిత నేత నీలం నాగేంద్రరావు ఆధ్వర్యంలో మేదరమెట్ల పోలీస్ స్టేషన్ ముందు ఆందోళన చేయడం జరిగినది. ఈ క్రమంలో చీరాల డిఎస్పి ప్రసాదరావు ఆదివారం మేదరమెట్లలో జరిగిన ఘటన స్థలానికి వచ్చి కేసుకు సంబంధించిన సాక్షులను విచారించారు. ఈ కేసుకు సంబంధించి మేదరమెట్ల ఎస్సై నాగ శివారెడ్డి పై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేయాలని దళిత నేత నీలం నాగేంద్రరావు చీరాల డిఎస్పి ప్రసాదరావుకి ఫిర్యాదు చేశారు.

నిజాయితీ, నిబద్ధతతో జర్నలిస్టుగా పనిచేయాలనుకుంటున్నారా?
మీ ఏరియాలోని ప్రజల సమస్యలకు మీ కలం ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళాలనుకుంటున్నారా? ఇంకెందుకు ఆలస్యం...?
మీ ఏరియాకు మీరే రిపోర్టర్... రండి....
జాతీయ తెలుగు దినపత్రిక ప్రజాపాలన
తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో జిల్లా, మండలాల వారీగా విలేకరులను ఆహ్వానిస్తుంది
అర్హత : నిజాన్ని నిర్భయంగా చెప్పగలిగే సత్తా ఉండాలి
వివరాలకు ఈ క్రింది నెంబర్లలో సంప్రదించండి..:
సెల్ : 8886022523, 9000621111,9848725373

జాతీయ తెలుగు దినపత్రిక ప్రజాపాలన దినపత్రికలో
పుట్టినరోజు / ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు రూ. 500
కోర్టు నోటీసులు / పబ్లిక్/ కంపెనీస్ నోటీసులు రూ. 600
Contact : 8886022523, 9000621111, 9948725373

bahujan bazaar
మీరు కోరుకున్న పుస్తకాలు / ప్రొడక్ట్స్ మీ ఇంటికి వద్దకే చేర్చే ఆన్లైన్ షాపింగ్
To Order Visit : www.bahujanbazaar.in
Contact No. : 8886022523

జాతీయ తెలుగు దినపత్రిక ప్రజాపాలన దినపత్రికలో
మంత్లీ అడ్వర్టైజ్‌మెంట్స్
4x5. Rs. 13,000/- p.m.
8x10. Rs. 24,000/- p.m.
12x10. Rs. 36,000/- p.m.
5 లైన్ల క్లాసిఫైడ్ యాడ్ రూ. 5000/- p.m.
Quarter Page (16x20) Ad (1st Page) Rs. 96,000/- p.m.
Contact : 8886022523, 9000621111, 9948725373

SNEHA MACS LTD Ph : 7660027682
"THE SNEHA MUTUALLY AIDED CO-OPERATIVE THRIFT AND CREDIT SOCIETY LIMITED"
స్నేహ మ్యూచువల్ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్
మీ డిపాజిట్ 7 సం॥లకే రెట్టింపు (Double)
మీ మనవళ్ళకు మరియు మనవరాళ్ళకు చదువుకు, పెళ్ళికోసం కానుకగా
5 సం.ల ఫిక్స్‌డ్ డిపాజిట్‌పై 12% వడ్డీ
గత 20 సం॥లుగా సమాజ మార్పు కోసం కంపెనీకి వచ్చే లాభాలను పేద ప్రజల కనీస అవసరాల కోసం ఖర్చు చేస్తూ SOCIAL ENGINEERING చేస్తున్నాం
H.NO. NO. 6-2-19/3/12, 3rd Floor, Doulat Plaza, Lakdikapool, Hyderabad, Telangana.
Email : snehamacsltd@gmail.com

స్నేహ పెండ్లిపిలుపు
స్నేహ మ్యారేజ్ బ్యూరో



వివరాలకు :
https://snehapellipilupu.com/
9154958315

SNEHA MACS LTD Ph : 040-23233989
"THE SNEHA MUTUALLY AIDED CO-OPERATIVE THRIFT AND CREDIT SOCIETY LIMITED"
Regd. No. TS/ DCO/HYD/MACS/2017?314 Dt 30th May 2017
స్నేహ పెన్షన్ స్కీమ్
చేరండి ఈ సువర్ణావకాశాన్ని సద్వినియోగం చేసుకోండి
01 జనవరి 2021 నుండి 7 సం॥ల పాటు డిపాజిట్ చేసిన వారికి డబుల్ ఎమౌంట్ ఇవ్వబడును

| సంవత్సరానికి 11% వడ్డీ ఇవ్వబడును | మీ డిపాజిట్ లభించే వడ్డీ |
|---|---|
| రూ. 1,00,000/- | రూ. 11,000/- |
| రూ. 5,00,000/- | రూ. 55,000/- |
| రూ. 10,00,000/- | రూ. 1,10,000/- |

మీ మనవళ్ళకు మరియు మనవరాళ్ళకు చదువుకు, పెళ్ళికోసం కానుకగా
మీ డిపాజిట్ 7 సం॥లకే రెట్టింపు (Double)
డాక్టర్ కె. శివభాగ్యారావు IRS, VRS చైర్మన్
ఎస్. రామకృష్ణ మ్యాక్స్ ప్రెసిడెంట్, సెల్: 9133312134

కావలెను
స్నేహ గ్రూప్ విజయవాడ, గుంటూరు, వైజాగ్ హైదరాబాద్ నందు పనిచేయుటకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను.
నెలకు రూ.15,000/- జీతం,
ట్రావెలింగ్ అలవెన్సు, ఇన్సెంటివ్ ఇవ్వబడును.
ఆసక్తి గలవారు మీ వివరాలని ఈ క్రింది నెంబర్ కి వాట్సాప్ చేయగలరు.
7660027683, 91549 58315

# ఓబీసీ కులగణనకు కాంగ్రెస్ మద్దతు

- ఓబీసీ సంఘాలతో రాహుల్ గాంధీ భేటీ
- పాల్గొన్న అన్ని రాష్ట్రాల ప్రతినిధులు



**న్యూఢిల్లీ,** : కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే దేశ వ్యాప్తంగా బీసీ కులగణన చేపడతామని, వెనుకబడిన వర్గాల జనాభా దామాషా ప్రకారం వాటా దక్కడానికి కృషి చేస్తామని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. 29 రాష్ట్రాలకు చెందిన ఓబీసీ సంఘాల ప్రతినిధులు జాతీయ బీసీ కమిషన్ మాజీ ఛైర్మన్, అఖిల భారత బీసీ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షులు జస్టిస్ ఈశ్వరయ్య నేత త్వంలో శనివారం రాహుల్ గాంధీ తో న్యూఢిల్లీలోని ఆయన నివాసంలో భేటీ అయ్యారు. మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్, జాజుల శ్రీనివాస్ గౌడ్, డాక్టర్ విజయభాస్కర్, డాక్టర్ చంద్రశేఖర్ నాయక్, శ్రీనివాస్, రవి జనగాం, రవీందర్ గౌడ్ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. దేశ వ్యాప్తంగా ఓబీసీలు ఎదుర్కొంటున్న సవాళ్లు, డిమాండ్లపై రాహుల్ గాంధీ వారితో దాదాపు గంటసేపు చర్చించారు. గతపదేళ్లుగా ఓబీసీ కులగణన నిర్వహించకుండా కేంద్ర ప్రభుత్వం బీసీలను నిర్లక్ష్యం చేసిందని వారు రాహుల్‌కు వివరించారు. ఓబీసీలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రత్యేక చొరవ తీసుకుని మండల్ కమిషన్ సిఫారసులను పూర్తిగా అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలని సంఘాల ప్రతినిధులు కోరగా, అన్ని విధాలుగా వారికి సహాయ సహకారాలు అందిస్తామని రాహుల్ హామీ ఇచ్చారు. అనంతరం జస్టిస్ ఈశ్వరయ్య మీడియాతో మాట్లాడుతూ.. సమావేశం వివరాలను వెల్లడించారు. దేశవ్యాప్తంగా ఉన్న బీసీ ఫెడరేషన్, బీసీ సంఘాల నాయకులు రాహుల్ గాంధీని కలిశారని తెలిపారు. బీజేపీ జాతీయ జనగణన చేయకపోగా ఎలాంటి విచారణ జరపకుండా అగ్రకులాలకు 10 శాతం రిజర్వేషన్లు కేటాయించిందని విమర్శించారు. అన్ని ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు చేస్తానంటోందని, మండల కమిషన్ సిఫారసులను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రామాలయం పేరుతో ఇంటింటికి అక్షింతలు పంచుతున్నారే తప్ప కుల జనగణ చేపట్టడం లేదని దుయ్యబట్టారు. బీసీలకు రావాల్సిన వాటా, రిజర్వేషన్లు రావడం లేదని ఈశ్వరయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ఇండియా కూటమిలో ఒక్క రాహుల్ గాంధీ తప్ప బీసీ జనగణనను ఎవరూ మాట్లాడటం లేదని విమర్శించారు. ఇండియా కూటమికి బీసీ ఫెడరేషన్, బీసీ సంఘాలు మద్దతు ఇస్తామని ఆయన ప్రకటించారు. భారత్ జోడో న్యాయయాత్రకు మద్దతు ఇవ్వాలని నిర్ణయించుకున్నట్టు వెల్లడించారు. తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అక్కడ బీసీ జనగణన చేపట్టాలని ఈశ్వరయ్య విజ్ఞప్తి చేశారు. తెలంగాణలో బీసీ జనగణ చేపట్టడం వల్ల దేశ వ్యాప్తంగా ఉన్న బీసీ వర్గం కాంగ్రెస్‌ను నమ్ముతారని ఆశాభావం వ్యక్తం చేశారు. పొలిటికల్ పవర్ వస్తేనే అన్ని సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని అభిప్రాయపడ్డారు. అనంతరం మధుయాష్కీ గౌడ్ మాట్లాడుతూ... జస్టి స్ ఈశ్వరయ్య ఆధ్వర్యంలో బీసీ ఫెడరేషన్ తరపున అన్ని రాష్ట్రాల నుంచి రాహుల్ గాంధీని కలిశామని వివరించారు.

బీసీ జనగణన జరపాలని రాహుల్ గాంధీ పార్లమెంట్‌లో డిమాండ్ చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. మొట్ట మొదటిసారి బీసీ ఫెడ రేషన్ ఒక రాజకీయ పార్టీకి మద్దతు ఇస్తానంటోందని సంతోషం వ్యక్తం చేశారు. ఇండియా కుటమికి దేశవ్యాప్తంగా ఉన్న బీసీ ఫెడరేషన్ మద్దతు ఇవ్వాలని నిర్ణయం తీసుకుందని మధు యాష్కీ వెల్లడించారు. బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయ కుండా, జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు పెంచ కుండా కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరి స్తోందని బీసీసంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు.

## ప్రజాసేవకే నా జీవితం అంకితం ...

# నన్ను వదిలిపెట్టకండి ...!

### మంత్రి పొన్నం ప్రభాకర్ భావోద్వేగం

ప్రజా పాలన– ఉమ్మడి కరీంనగర్ జిల్లా బ్యూరో చీఫ్, జనవరి 14: ఢిల్లీలో పర్యటిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్‌ను క్రిబ్కో ఛైర్మన్ బీరేంద్ర సింగ్, ఢిల్లీ కో ఆపరేటివ్ బ్యాంక్ ఎండీ అనితా రావత్ సన్మానించారు. ఈ క్రమంలో.. ఆనాటి జ్ఞాపకాలను మంత్రి గుర్తు చేసుకున్నారు. కో ఆపరేటివ్ నుంచి విద్యార్థి నాయకుడుగా ప్రారంభమైన తన ప్రస్థానం.. మంత్రి వరకు కొనసాగిందని పొన్నం చెప్పుకొచ్చారు. మంత్రి అయ్యానని తనను ఒదిలేయొద్దని.. తాను ఎప్పటికీ తమ్ముడినేనంటూ పొన్నం చెప్పుకొచ్చారు. ఈ క్రమంలో మాట్లాడిన మంత్రి పొన్నం ప్రభాకర్ కొంచెం ఎమోషనల్ అయ్యారు. అతి చిన్న వయసులోనే మార్కెట్ కమిటీ ఛైర్మన్ అయ్యాననని.. ఐదేళ్లు ఛైర్మన్‌గా చేశానని పొన్నం ప్రభాకర్ చెప్పుకొచ్చారు. క్రిబ్కో ప్రోత్సాహం వల్ల ఎంతో ఎదిగానన్నారు. క్రిబ్కో, ప్రజల ఆశీర్వాదం ఎల్లప్పుడూ ఉండాలన్నారు. పార్టీ అధికారంలోకి రావడంతో తాము సీనియర్లుగా ఉండడం వల్ల తనకు మంత్రిగా అవకాశం వచ్చిందన్నారు. ఇచ్చిన హామీ మేరకు మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం ఏర్పాటు చేశామని తెలిపారు. 7 వ తేదీన ప్రభుత్వం ఏర్పడితే.. 9వ తేదీనే మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని ప్రారంభించామని పేర్కొన్నారు. ఫ్రీ టికెట్ ద్వారా ఇప్పటి వరకు 7 కోట్ల మంది మహిళలు ఉచిత ప్రయాణం చేశారని మంత్రి చెప్పుకొచ్చారు. నిన్ననే లోక్ సభ ఎన్నికల సన్నాహక సమావేశం జరిగింది. మీ అందరి ఆశీర్వాదం కోసం ఇక్కడికి వచ్చా. అందరి కంటే చిన్న వయసులో కో ఆపరేటివ్‌గా పని చేశా. మీ అందరి ప్రేమను పొందాను. మీ ప్రేమ అభినమనాలు నా జీవితంలో మర్చిపోను. ఈసారి మంత్రి అయ్యాను. ఢిల్లీకి రాజయిన తల్లికి కొడుకే కాబట్టి.. మంత్రినయినా మీకు మాత్రం చిన్నోడినే. మీ ప్రేమ అప్పుడు ఎలా ఉందో.. ఇప్పుడు కూడా అలానే ఉండాలని కోరుకుంటున్న. మంత్రి అయ్యానని నన్ను ఒదిలేయకండి.. నేను మీ తమ్ముడిని. విద్యార్థి నాయకుడుగా ప్రారంభమైన నా ప్రస్థానం.. మంత్రి వరకు కొనసాగింది." అంటూ పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యానించారు.




# కాంగ్రెస్‌కు కేంద్ర మాజీ మంత్రి రాజీనామా

## శివసేనలోకి మిలింద్ దేవరా!



**ముంబై :** మహారాష్ట్రకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి మిలింద్ దేవరా ఆ పార్టీకి రాజీనామా చేశారు. ఈ విషయాన్ని ఎక్స్ ద్వారా వెల్లడించారు. "ఈ రోజుతో నా రాజకీయ ప్రయాణంలో ఓ ముఖ్యమైన అధ్యాయం ముగిసింది. కాంగ్రెస్ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశాను. పార్టీతో నా కుటుంబానికి ఉన్న 55 ఏళ్ల అనుబంధం ముగిసింది. ఇన్నేళ్లు నాకు అండగా నిలిచిన పార్టీ కార్యకర్తలు, నాయకులు, సహచరులకు ధన్యవాదాలు" అని మిలింద్ రాసుకొచ్చారు. అయితే ఇండియా కూటమి సీట్ల పంపకాల్లో అసంతృప్తికి గురైన మిలింద్.. ఈ నిర్ణయం తీసుకున్నారని తెలుస్తోంది. కాగా ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేన పార్టీలో మిలింద్ దేవరా చేరనున్నారని సమాచారం. కాంగ్రెస్ సీనియర్ నేత మురళీ దేవరా కుమారుడే ఈ మిలింద్. దక్షిణ ముంబై లోక్‌సభ స్థానం నుంచి 2004, 2009లో మిలింద్ విజయం సాధించారు. 2012లో కేంద్ర మంత్రిగా పనిచేశారు.

# మాంజా దారం మెడకు చుట్టుకొని సైనికుడు మృతి..!



హైదరాబాద్: హైదరాబాద్‌లో విషాదకర ఘటనలు చోటు చేసుకున్నాయి. సంక్రాంతి పండుగ వేళ ఎగురవేస్తున్న పతంగులతో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. వేర్వేరు ఘటనలో ఇద్దరు మృతి చెందడంతో పండుగ వేళ విషాదం అలుముకున్నది. పతంగులు ఎగురవేస్తూ భవనంపై కింద పడి యువకుడు తుదిశ్వాస విడిచారు. మాంజాదారం మెడకు చుట్టుకొని తీవ్ర గాయాలతో సైనికుడు ప్రాణాలను విడిచాడు. వివరాల్లోకి వెళితే.. విశాఖపట్నంకు చెందిన సైన్యంలో సేవలందిస్తున్న కోటేశ్వరరావు హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. విధులు ముగించుకొని ఆయన ఇంటికి వెళ్తున్న సమయంలో లంగర్‌హౌస్‌పై వద్ద మెడకు మాంజా చుట్టుకున్నది. దీంతో కోటేశ్వరరావుకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆయను ఆసుపత్రికి తరలించారు. తీవ్ర గాయాలకు గురైన ఆయన పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ మృతి చెందారు. అలాగే అల్వాల్‌లో యువకుడు భవనంపై నుంచి కిందపడ్డాడు. మృతుడిని పేట్ బషీర్‌భాగ్ పోలీస్‌స్టేషన్‌లో పని చేస్తున్న ఏఎస్ఐ తనయుడు ఆకాశ్‌గా గుర్తించారు. పతంగుల కారణంగా గత రెండురోజుల్లో ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. పండుగ వేళ మృతుల కుటుంబాల్లో విషాదం అలుముకున్నది. చైనా మాంజాపై నిషేధం ఉన్న నిబంధనలకు విరుద్ధంగా పలువురు విక్రయిస్తున్నారు. పతంగులను ఎగురవేస్తూ ఇష్టారాజ్యంగా వదిలివేస్తుండడంతో మాంజాదారం ప్రమాదాలు జరుగుతున్నాయి. అలాగే, పక్షులు సైతం బలవుతున్నాయి.

## మలేషియా ఓపెన్‌లో సంచలనం

# ఫైనల్‌కు సాత్విక్-చిరాగ్ జోడీ




### చరిత్ర సృష్టించిన భారత షట్లర్ల ద్వయం

**కౌలాలంపూర్:** భారత స్టార్ బ్యాడ్మింటన్ ద్వయం, వరల్డ్ నం.2 సాత్విక్ సాయిరాజ్ రాంకిరెడ్డి మరియు చిరాగ్ శెట్టి జోడీ చరిత్ర సృష్టించింది. మలేషియా ఓపెన్ సూపర్ 1000 టోర్నమెంట్‌లో మెన్స్ డబుల్స్ ఫైనల్‌కు సాత్విక్- చిరాగ్ జోడీ దూసుకెళ్లింది. శనివారంనాడిక్కడ జరిగిన సెమీస్‌లో కొరియాకు చెందిన 'కంగ్ మిన్ హ్యుక్-సీయోస్యూంగ్‌జె' జోడీపై 21-18, 22-20 తేడాతో సాత్విక్- చిరాగ్ జోడీ విజయం సాధించింది. 1983 తర్వాత మలేషియా ఓపెన్‌లో డబుల్స్ విభాగంలో ఫైనల్‌కు చేరడం ఇదే తొలిసారి. గత ఏడాది ఇదే టోర్నీలో సెమీస్ వరకు చేరిన భారత జోడీ, ఈ ఏడాది మాత్రం పట్టు విడవలేదు. దక్షిణకొరియా జంటసైతం నువ్వా నేనా అని గట్టి పోటీనివ్వడంతో పోరు రసవత్తరంగా సాగింది. ఇక మ్యాచ్ విషయానికొస్తే... ర్యాంక్ వరల్డ్ నం.2 జోడీ తొలి గేమ్‌లో కొరియన్ జోడీ కంగ్ మిన్ హ్యుక్-సీయో స్యూంగ్ జే ద్వయం చేతిలో 11-18 తేడాతో ఓటమిని చవిచూసినా, రెండో గేమ్‌ను సాత్విక్- చిరాగ్ జోడీ ఆటతీరు మార్చి ప్రత్యర్థులపై వరుష షాట్లతో ముప్పతిప్పలు పెట్టారు. ఈ నేపథ్యంలో 21-18తేడాతో రెండో గేమ్‌ను కైవసం చేసుకుంది. మూడో గేమ్‌లోనూ అదే పంథాననుసరించి బలమైన సర్వీస్‌లతో ప్రత్యర్థిపై విరుచుకుపడ్డారు. 22-20 తేడాతో విజయం సాధించి ఫైనల్లోకి దూసుకెళ్లారు. తద్వారా మలేషియా ఓపెన్ డబుల్స్‌లో ఫైనల్స్ చేరిన భారత జోడీగా సాత్విక్- చిరాగ్ ద్వయం రికార్డులకెక్కారు. 44నిముషాలపాటు హోరాహోరీగా సాగిన ఈ పోరులో సాత్విక్- చిరాగ్ జోడీ రెండు సెట్లలోనూ గెలిచి తుదిపోరుకు అర్హత సాధించింది. అద్భుత క్రీడా ప్రదర్శనతో గ్లోబల్ బ్యాడ్మింటన్ వేదికపై భారత్ ప్రతిష్టను పెంచారని క్రీడాకారులు ప్రశంసలతో ముంచెత్తారు. ఇక ఫైనల్‌లో సాత్విక్- చిరాగ్ ద్వయం, రెండో సెమీస్‌లో వాంగ్-లియాంగ్ (చైనా), కొబయా షీ- హోకీ (జపాన్) మధ్య జరిగే పోరులో విజేతతో పోటీ పడనున్నారు. ఈ టోర్నీలో ఫైనల్‌లో గనక భారత జోడీ గెలిస్తే సూపర్ 1000 విభాగంలో వారికి రెండో టైటిల్ కానుంది. గతేడాది ఈ ఇద్దరూ ఇండోనేషియా ఓపెన్ సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. అయితే వుమెన్స్ డబుల్స్‌లో అశ్విని పొన్నప్ప- తనీషా క్రాస్టో ఆశలు గల్లంతయ్యాయి. శనివారంనాడిక్కడ జరిగిన వుమెన్స్ డబుల్స్ క్వార్టర్- ఫైనల్స్‌లో జపా న్ షటర్లు ఆర్. ఇవనగ- కె.నకనిషి చేతుల్లో పరాజయం పాలయ్యారు. టోర్నీ నుంచి అశ్విని పొన్నప్ప- తనీషా క్రాస్టో జోడీ వైదొలగింది.

# పతంగి ఎగరేస్తుండగా కిందపడ్డ బాలుడు

- తీవ్ర గాయాలతో స్పాట్‌డెడ్
- నాగోల్‌లో విషాదం

**హైదరాబాద్:** నాగోల్‌లో విషాదం చోటు చేసుకుంది. ఇంటిపై నుంచి కిందపడి ఓ బాలుడు మృతిచెందాడు. శివప్రసన్న(13) అనే బాలుడు పతంగి ఎగరేసేందుకు ఇవాళ ఉదయం ఇంటిపైకి వెళ్లాడు. ఈ క్రమంలో ఆడుకుంటూ వెనక్కి వచ్చి.. కాలుజారి ఇంటిమీద నుంచి కిందపడిపోయాడు. తలకు తీవ్ర గాయాలు కావడంతో స్పాట్‌లోనే చనిపోయాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మరోవైపు నిన్న అత్తాపూర్‌లో కైట్ ఎగరవేస్తుండగా.. తనిష్క్ అనే బాలుడు కరెంట్ షాక్‌తో మృతి చెందిన సంగతి తెలిసిందే.



# సీఎంఆర్ ఇవ్వకుంటే సొత్తు రికవరీ!

● అవసరమైతే రైసు మిల్లుల వేలం? ● ఇందుకు సంబంధించిన న్యాయపరమైన ప్రక్రియపై కసరత్తు పూర్తి ● జిల్లాల వారీగా సీఎంఆర్ బకాయి పడిన మిల్లుల జాబితా సిద్ధం ● ఈ నెలాఖరు వరకు సీఎంఆర్ బకాయిలు చెల్లించేందుకు మిల్లర్లకు గడువు ● ఇప్పటికే రెండుసార్లు గడువు పొడిగింపు ● ఈనెల 31 తర్వాత.. కఠిన చర్యలకు సన్నద్ధమవుతున్న పౌరసరఫరాలశాఖ


**హైదరాబాద్,** కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్ బియ్యం) పెద్ద మొత్తంలో బకాయిపడిన రైసు మిల్లర్లపై కఠిన చర్యలకు పౌరసరఫరాలశాఖ సిద్ధమవుతోంది. పెద్ద మొత్తంలో సీఎంఆర్ రైస్ బాకీ పడిన మిల్లుల ఆస్తులను రికవరీ చేయాలన్న ప్రాథమిక నిర్ణయానికి వచ్చింది. అవసరమైతే రెండు విడతలు సీఎంఆర్ బకాయి ఉన్న మిల్లులకు నోటీసులు ఇచ్చి వేలం వేసేందుకు కూడా వెనకాడకూడదన్న కఠిన నిర్ణయానికి వచ్చింది. ఇందుకు సంబంధించి అనుసరించాల్సిన న్యాయ ప్రక్రియపై కార్పొరేషన్ చేస్తున్న కసరత్తు ముగింపుకు వచ్చినట్టు సమాచారం. పక్కా సాక్ష్యాధారాలతో మిల్లర్లను కోర్టుకు ఈడ్చి... కోర్టు ఆదేశాలతో సీఎంఆర్‌లో అక్రమాలకు పాల్పడిన, పెద్ద మొత్తంలో బకాయిపడిన మిల్లులను జప్తు చేసేందుకు సిద్ధమవుతోంది. సీఎంఆర్ బకాయి పడిన రైసు మిల్లుల జాబితాను జిల్లాల వారీగా పౌరసరఫరాలశాఖ సిద్ధం చేసినట్టు తెలిసింది. రాష్ట్రంలో దాదాపు 3300 రైసు మిల్లులు ఉండగా ఇందులో చాలా రైసు మిల్లులు ఏళ్ల తరబడి సీఎంఆర్ బకాయి పడినట్టు తెలిసింది.

గత ఏడాది వానాకాలం, ఎండా కాలం సీజన్‌లో రైస్ మిల్లర్లకు సీఎంఆర్ కింద ఇచ్చిన ధాన్యాన్ని మర ఆడించి బియ్యం ఇవ్వాల్సిన రైస్ మిల్లర్లు ఇవ్వకపోవడంపై రాష్ట్ర ప్రభుత్వంగా సీరియస్‌గా ఉంది. ఈనెలాఖరు వరకు (జనవరి 31కల్లా) బియ్యం ఇవ్వని మిల్లర్లపై కొరడా ఝుళిపించాలని, ఎంతటి వారైనా సరే కఠినంగా వ్యవహరించాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఇప్పటికే పౌర సరఫరాల శాఖ అధికారులకు ఆదేశాలు జారీచేశారు. ఈ మేరకు అన్ని జిల్లాల కలెక్టర్‌లు, అదనపు కలెక్టర్‌లు, పౌరసరఫరాల శాఖాధికారులు సంయుక్తంగా సీఎంఆర్ బియ్యం ఇవ్వాల్సి ఉన్న మిల్లర్లపై ప్రత్యేక దృష్టి సారించారు. సీఎంఆర్ విషయంలో అక్రమాలకు పాల్పడిన మిల్లుల యజమాన్యాన్ని కోర్టుకీడ్చేందుకు పౌరసరఫరాలశాఖ సిద్ధమవుతోంది. ప్రస్తుతం తెలంగాణ పౌరసరఫరాలశాఖ ఎఫ్‌సీఐకు 7.83లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ఈ నెలాఖరుకల్లా అందించాల్సి ఉంది. అదే సమయంలో తెలంగాణలోని రైస్ మిల్లర్లు రాబోయే రోజుల్లో 42 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సివిల్ సప్లై కార్పొరేషన్‌కు అప్పగించాలని ప్రభుత్వం ఆదేశించింది.

రైతులకు మద్దతు ధర కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసి కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) కోసం రైసు మిల్లర్లకు అప్పగిస్తుండడంతో ఈ ప్రక్రియ రైసు మిల్లర్లకు ఆదాయవనరుగా మారింది. ధాన్యం కేటాయించిన 45 రోజుల్లో మర ఆడించి బియ్యంగా మార్చి క్వింటా ధాన్యానికి 68 శాతం బియ్యం చొప్పున సివిల్ సప్లై కార్పొరేషన్‌కు మిల్లర్లు ఇవ్వాల్సి ఉంటుంది. అయితే కొందరు రైసు మిల్లర్లు సీఎంఆర్ బియ్యాన్ని అక్రమంగా ప్రయివేటు మార్కెట్‌లో అమ్ముకుంటూ సివిల్ సప్లైసంస్థను ఆర్థికంగా దివాళా తీయిస్తున్నారు. ఈ ఏడాది ఆగస్టు నాటికే సీఎంఆర్ బియ్యాన్ని అందించాల్సి ఉన్నా ఇప్పటికీ పెద్దసంఖ్యలో మిల్లర్లు సీఎంఆర్ బాకీ ఉన్నారు. గడువును గతేడాది డిసెంబరు 31 వరకు ఆ తర్వాత ఈ ఏడాది జనవరి 31వరకు ప్రభుత్వం పొడిగించింది. అయినా సీఎంఆర్ బకాయిలు మిల్లర్ల వద్ద నుంచి వచ్చే పరిస్థితులు కనిపించడం లేదు. ఇప్పటి వరకు సీఎంఆర్ బకాయిపడిన మిల్లర్లకు నోటీసులు జారీ చేయడం, అక్కడక్కడా రైస్ మిల్లర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేయడం మినహా అధికారులు ఏమీ చేయలేక పోతున్నారు. ఈ నేపథ్యంలో అక్రమాలకు పాల్పడుతున్న రైసుమిల్లర్ల ఆట కట్టించేందుకు మిల్లులను వేలం వేయాలన్న కఠిన నిర్ణయానికి రాష్ట్ర ప్రభుత్వం వచ్చినట్టు తెలిసింది.

వాస్తవానికి గతేడాది డిసెంబర్ నెలాఖరు కల్లా సీఎంఆర్ రైస్ బకాయిలను చెల్లించాలని పౌరసరఫరాలశాఖ రైస్ మిల్లర్లను ఆదేశించినా ఫలితం రాలేదు. ఒక సీజన్‌లో ఇచ్చిన ధాన్యాన్ని మరో సీజన్ వచ్చేలోపు ధాన్యాన్ని బియ్యంగా మార్చి ఇవ్వాల్సి ఉంటుంది. కానీ మూడేళ్ల నుంచి రైస్ మిల్లర్లు ఇష్టా రాజ్యంగా వ్యవహరిస్తున్నారని పౌరసరఫరాలశాఖ అధికారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది వానాకాలం సీజన్‌లో కొనుగోలు కేంద్రాలకు సన్న ధాన్యం ఎక్కువగా వచ్చింది. తర్వాత ఆ ధాన్యానికి మంచి డిమాండ్ పెరగంతో మిల్లర్లు ఆ ధాన్యాన్ని బయట విక్రయించుకుని సొమ్ము చేసుకున్నారు. దొడ్డు ధాన్యాన్ని కూడా ఆంధ్ర ప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాలకు తరలించి విక్రయించారని సమాచారం. పౌరసరఫరాల శాఖ అధికారులు, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల తనిఖీల్లో ప్రభుత్వం మిల్లర్లకు ఇచ్చిన ధాన్యం మిల్లుల్లో లేవని తేలింది.

రుణాలు తీసుకుని మరీ రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని మరాడించేందుకు మిల్లర్లకు అప్పగిస్తే మిల్లర్లు నాణ్యమైన బియ్యాన్ని ప్రయివేటు మార్కెట్‌లో అమ్ముకున్నట్లు పలు జిల్లాల్లో పౌరసరఫరాల శాఖ అధికారుల తనిఖీ ల్లో తేలింది. ఇలా రైసు మిల్లర్ల కక్కుర్తి కారణంగా సివిల్ సప్లై కార్పొరేషన్ అప్పుల ఊబిలో కూరుకుపోతోందని ఆ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం తెలంగాణ సివిల్ సప్లై కార్పొరేషన్ రూ.58వేల కోట్ల అప్పుల్లో ఉండగా... రూ.11వేల కోట్ల నష్టాలు సంస్థపై పడింది. అప్పులపై ఏటా రూ.3వేల కోట్లను వడ్డీల కిందే కార్పొరేషన్ చెల్లించాల్సిన విషమ పరిస్థితులు నెలకొన్నాయి. మిల్లర్ల అక్రమాల కారణంగా ఎఫ్‌సీఐకి సీఎంఆర్ బియ్యం సరఫరాలో జాప్యం నెలకొంటోంది. ఫలితంగా కార్పొరేషన్ ఆర్థికంగా నష్టపోవడంతోపాటు భవిష్యత్‌లో తెలంగాణకు ధాన్యం కొనుగోళ్ల కేటాయింపులపై తీవ్ర పరిణామాలుంటాయని రాష్ట్ర పౌరసరఫరాల మంత్రిత్వశాఖ చెబుతోంది. ఈ నేపథ్యంలో సీఎంఆర్ అక్రమాలకు పాల్పడుతున్న మిల్లులను చట్టపరంగా వేలం వేయాలన్న కఠిన నిర్ణయానికి పౌరసరఫరాలశాఖ వచ్చినట్టు తెలుస్తోంది.



## ప్రాణ ప్రతిష్ట వేడుకకు 55 దేశాల నుంచి 100 మంది ప్రముఖుల హాజరు

అయోధ్య: జనవరి 22న అయోధ్యలో నూతనంగా నిర్మించిన రామాలయ ప్రారంభోత్సవ వేడుకలకు సర్వం సిద్ధమైంది. ఆ రోజున శ్రీరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ట కార్యక్రమానికి 55 దేశాల నుంచి రాయబారులు, ఎంపీలు సహా దాదాపు 100 మంది హాజరు కానున్నారు. ప్రభు శ్రీరామ్ వంశజ్ అని చెప్పుకునే కొరియన్ రాణిని కూడా ఆహ్వానించామని ప్రపంచ హిందూ ఫౌండేషన్ గ్లోబల్ చైర్మన్ స్వామి విజ్ఞానానంద తెలిపారు. అర్జెంటీనా, ఆస్ట్రేలియా, బెలారస్, బొత్స్వానా, కెనడా, కొలంబియా, డెన్మార్క్, డొమ్నిక్, కాంగో, ఈజిప్ట్, ఇథియోపియా, ఫిజీ, ఫిన్లాండ్, ఫ్రాన్స్, జర్మనీ, ఘనా, గయానా, హాంకాంగ్, హంగరీ, ఇటలీ, ఇండోనేషియా, బ్రిటన్, అమెరికా, న్యూజిల్యాండ్, సింగపూర్ సహా పలు దేశాల నుంచి అతిథులకు ఆహ్వానాలు అందించామని చెప్పారు. పలు దేశాధినేతలు సైతం ఈ కార్యక్రమానికి హాజరు కానున్నారని స్వామి విజ్ఞానానంద వెల్లడించారు. వీహెచ్‌పీ విదేశీ ప్రతినిధులు జనవరి 20న లక్నో వస్తారని ఆపై జనవరి 21 సాయంత్రానికి అయోధ్య చేరుకుంటారని ఆయన తెలిపారు. ఇక జనవరి 22న ప్రధాని నరేంద్ర మోదీ, యూపీ సీఎం యోగి ఆదిత్యానాథ్ సహా పలువురు ప్రముఖుల సమక్షంలో శ్రీరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ట కార్యక్రమం జరగనుంది.



# గీత దాటారు!

● మీ చర్య ప్రాదేశిక సమగ్రత ఉల్లంఘన
● పీవోకేలో బ్రిటన్ హైకమిషర్ పర్యటన
● భారత్ అభ్యంతరం...

**న్యూఢిల్లీ:** పాకిస్తాన్‌లో బ్రిటన్ హైకమిషనర్ జానె మారియట్ ఇటీవల పాక్ ఆక్రమిత కాశ్మీర్ (పీవోకే)లో పర్యటించారు. జనవరి 10న పీవోకేలోని మీర్‌పూర్ ప్రాంతానికి వెళ్లారు. దీనిపై భారత విదేశాంగశాఖ తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేసింది. ఇదెంత మాత్రం అమోదయోగ్యం కాదని తెలిపింది. బ్రిటిష్ హై కమిషనర్, యూకే విదేశాంగ కార్యాలయ సిబ్బంది పీవోకేలో పర్యటించడాన్ని భారత్ తీవ్రంగా పరిగణించింది. మనదేశ సార్వభౌమత్వం, ప్రాదేశిక సమగ్రతను ఉల్లంఘించే ఈ చర్య ఎంతమాత్రం ఆమోద యోగ్యం కాదని, ఈ ఉల్లంఘనపై మా ఆందోళనను ఢిల్లీలోని బ్రిటిష్ హైకమిషనర్ దృష్టికి తీసుకెళ్లినట్లు కేంద్ర విదేశాంగ శాఖ అధికారిక ప్రకటనలో తెలిపింది. జమ్ము-కాశ్మీర్, లడఖ్ ఎప్పటికీ భారత్‌లోని అంతర్భాగాలేనని పునరుద్ఘాటించింది. జానె మారియట్ పీవోకే పర్యటనపై పాక్ మీడియా కథనాలు ప్రచురించింది. బ్రిటన్‌లో పాక్ సంతతికి చెందిన వారిలో 70శాతం మంది మీర్‌పూర్ నుంచేఉన్నారు. అందుకే, ఆమె అక్కడ పర్యటించారు అని పాక్ మీడియా పేర్కొంది.

కాగా, గతంలో పాక్‌లోని అమెరికా రాయబారి డొనాల్డ్ బ్లోమ్ కూడా పీవోకేలో పర్యటించిన సంగతి తెలిసిందే. గతేడాది సెప్టెంబర్‌లో పాక్ ఆక్రమిత కాశ్మీర్‌కు వెళ్లిన ఆమె, అక్కడ కొన్ని సమావేశాలు నిర్వహించారు. దీనిపై అప్పట్లో భారత విదేశాంగశాఖ అమెరికాకు అభ్యంతరం తెలియ జేసింది. ప్రపంచ దేశాలు దేశ సార్వభౌమత్వాన్ని, ప్రాదేశిక సమగ్రతను గౌరవించాలని సూచించింది.

# యెమెన్‌పై యుఎస్ క్షిపణి దాడులు

**వాషింగ్టన్:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరింత తీవ్రమవుతున్నాయి. ఎర్రసముద్రంలో హౌతీ రెబల్స్‌పై అమెరికా ప్రతీకార దాడులు కొనసాగుతున్నాయి. యెమన్‌లోని హౌతీల కేంద్రంపై అమెరికా శనివారం మరోసారి క్షిపణులతో విరుచుకుపడింది. రాజధాని సనాలో భారీ పేలుడు శబ్దం వినిపించినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఎర్రసముద్రం, గల్ఫ్ ఆఫ్ ఎడెన్‌లోని యెమన్ తీర ప్రాంతాలవైపు రావొద్దని అమెరికా జెండాలతో ఉన్న వాణిజ్య నౌకలను యూఎస్ నేవీ హెచ్చరించింది. మరో 72 గంటలపాటు ఆ మార్గంలో వెళ్లొద్దని సూచించింది. ఈ ప్రకటన చేసిన కొద్ది గంటలకే హౌతీ కేంద్రంపై క్షిపణి దాడి జరిగింది. తాజా పరిణామాలపై అమెరికా అధ్యక్షుడు బైడెన్ స్పందిస్తూ, హౌతీలు మరిన్ని భీకర దాడులు ఎదుర్కోవాల్సి ఉంటుంది అని హెచ్చరించారు.

కాగా, శుక్రవారం యెమన్‌లోని పలు ప్రాంతాలపై యూఎస్, బ్రిటన్ సైన్యాలు హౌతీ సాయుధ ముఠా స్థావరాలను లక్ష్యంగా చేసుకుని క్షిపణుల వర్షం కురిపించాయి. రాజధాని సనా సహా 28 ప్రాంతాల్లో 70కిపైగా లక్ష్యాలను శుక్రవారం ధ్వంసం చేశాయి.

# మహిళా కానిస్టేబుల్‌కు అసభ్యకర సందేశాలు పంపిన ఎస్ఐ.. సస్పెండ్



లక్నో: మహిళా కానిస్టేబుల్‌కు ఒక సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్ఐ) అసభ్యకర సందేశాలు పంపాడు. మెసేజ్‌లతో ఆమెను వేధించాడు. దీంతో ఆ మహిళా కానిస్టేబుల్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసింది. ఈ నేపథ్యంలో ఆ ఎస్ఐను సస్పెండ్ చేశారు. ఉత్తరప్రదేశ్‌లోని బరేలీ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్ఐ) చంద్రపాల్ సింగ్ తన పట్ల దురుసుగా, అనుచితంగా ప్రవర్తించాడని, తన మొబైల్ ఫోన్‌కు అసభ్యకర సందేశాలు పంపి వేధిస్తున్నాడని మహిళా కానిస్టేబుల్ ఫిర్యాదు చేసింది. బరేలీ ఎస్పీ ఘులే సుశీల్ చంద్రభాన్ ఈ ఫిర్యాదుపై స్పందించారు. దర్యాప్తు చేయాలని సంబంధిత స్టేషన్ పోలీస్ అధికారులను ఆదేశించారు. కాగా, ఎస్ఐ చంద్రపాల్ సింగ్ మహిళా కానిస్టేబుల్‌తో అనుచితంగా ప్రవర్మించినట్లు స్టేషన్ హెడ్ ఆఫీసర్ (ఎస్‌హెచ్‌వో) రిపోర్ట్‌లో పేర్కొన్నారు. వాట్సాప్‌లో అసభ్యకర సందేశాలు పంపడంతోపాటు అధికారిక బాధ్యతలకు విరుద్ధంగా ప్రవర్తించి పోలీస్ ప్రతిష్టను దిగజార్చినట్లు ఆరోపించారు. విధుల్లో నిర్లక్ష్యం, క్రమశిక్షణా రాహిత్యాన్ని తప్పుపట్టారు. ఈ నేపథ్యంలో ఎస్ఐ చంద్రపాల్ సింగ్‌ను సస్పెండ్ చేశారు. అలాగే ఆయనపై డిపార్ట్‌మెంటల్ దర్యాప్తు జరుపాలని పోలీస్ అధికారులను ఎస్పీ ఆదేశించారు.



## ప్రాణం తీసిన ఓవర్ స్పీడ్

○ అదుపు తప్పి లారీ బోల్తా
○ డ్రైవర్ స్పాట్‌డెడ్
○ మెదక్ జిల్లా హవేలీ ఘనపూర్‌లో ఘటన

**మెదక్ :** హవేలీ ఘనపూర్ మండల పరిధి ఔరంగాబాద్ శివారు లెప్రసి హాస్పిటల్ మలుపు వద్ద తెల్లవారుజామున రోడ్డుప్రమాదం జరిగింది. రేకుల లోడుతో మెదక్ నుంచి హవేలీ ఘనపూర్ వైపు వెళ్తున్న లారీ మలుపు వద్దకు రాగానే అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో డ్రైవర్ స్పాట్ లోనే చనిపోయాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. అనంతరం డెడ్‌బాడీని ఆస్పత్రికి తరలించారు. అతివేగమే ప్రమాదానికి కారణమని తెలుస్తోంది.

# చక్కెర పొంగలితో శ్రుతిహాసన్ సంక్రాంతి!



శ్రుతి హాసన్ కి గతేడాది బాగా కలిసొచ్చిన సంగతి తెలిసిందే. వరుస విజయాలతో అమ్మడు రెట్టించిన ఉత్సాహంతో కొత్త ఏడాదిలోకి అడుగు పెట్టింది. మరి ఏడాది ఆరంభంలో వచ్చే సంక్రాంతిని ఎలా సెలబ్రేట్ చేసుకుంటుంది? అమ్మడు ఎప్పుడు పబ్ లు..పార్టీలే అంటుందా? ఆమెకి కూడా ఇలాంటి పండుగలంటే? సరదానా? అంటే అవుననే అంటుంది. సంక్రాంతి అంటే అమ్మడికి బాల్యమే గుర్తొస్తుందిట. అయితే అప్పటిలా ఇప్పుడు ఎంజాయ్ చేయడం లేదుట. అప్పట్లో పండగ అంటే కొన్ని రోజుల ముందు నుంచే పండగ వాతావరణం మొదలయ్యేదిట. ఎందుకంటే నాన్న కమల్ హాసన్ సినిమా తప్పకుండా పండుగలకు రిలీజ్ అయ్యేదిట. సినిమా బృందం ఆ ఏర్పాటులో బిజీగా ఉంటే ..కుటుంబానికి కూడా అదే పండగలా అనిపించేదిట. పొంగల్ రోజున ఉదాయాన్ని నాన్నతో కలిసి సినిమా చూడటం..చక్కెర పొంగలి తినడం అనేది చాలా కాలం పాటు ఆనవాయితీగా కొనసాగించారుట. అయితే శ్రుతి హాసన్ సినిమాల్లోకి వచ్చిన తర్వాత ఆ సందడి..సరదా అంతా పోయింది అంటోంది. పండగ జరుపుకునే విధానం పూర్తిగా మారిపోయిందని అంటోంది. ఆ రోజున బంధువులతో ఫోన్లో మాట్లాడుతా అంటోంది. వీలుంటే స్వయంగా కలిసి బహుమతులు అందజేస్తుందిట. అయితే చక్కెర పొంగలి మాత్రం తప్పకుండా తింటుందిట. తనకిష్టమైన పండగ వంటకం మాత్రం ఎప్పుడూ మిస్ అవ్వదుట. ఎక్కడ ఎంత బిజీగా ఉన్నా పొంగల్ రోజు మాత్రం తప్పకుండా చక్కెర పొంగలి చేయించుకుని తింటుం దిట. అదండి శ్రుతి హాసన్ సంక్రాంతి సెలబ్రేషన్ అన్నది చక్కెర పొంగలిలో ఉంది. నటి అయిన తర్వాత శ్రుతిహాసన్ లో చాలా మార్పులొచ్చాయి. పూర్తిగా పాశ్చాత్య సంస్కృతికి అలవాటు పడినట్లు తెలుస్తుంది. అమ్మడికి ఖాళీ సమయం దొరికిందంటే పబ్ లు..పార్టీలంటూ బాగా ఎంజాయ్ చేస్తోందిట. మైఖేల్ కోర్సలే తో బ్రేకప్ తర్వాత శంతన్ హజారికాకు దగ్గరైన సంగతి తెలిసిందే. మరి ఈ సంక్రాంతిని ప్రియుడితో ఆస్వాదిస్తుందేమో!
















Printed,Published & Owned by: Sajja Dhananjaya Sarath, Printed & published at Unyted Publications, From H.no: #50-61,-3, Rajendra Nagar, Seethampet, Visakhapatnam-16. and SREE SESHASAI ENTERPRISES "D.NO : 3-88, "C/O CHANDRA THEATER," GOSALA VILLAGE, "MAIN ROAD, PENAMALURU MANDAL, KRISHNA DT, ANDHRAPRADESH, India. Editor: Sajja Dhananjaya Sarath. RNI:APTEL/2008/25531,Permitted for posting under concession rates of postage, Postal Registration No. VJ/189/2017-19,Email.editor.prajapalana@gmail.com
PIN: 521151."MOBILE :9912333140 Email : sreeseshasaivja@gmail.com.